S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక | తెలుగు దినపత్రిక

సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 115 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 21 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |



## ఏఐ, క్వాంటం హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- ప్రపంచపటంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ'
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఐబీఎం, యూఎన్‌ఐసీసీతో కీలక ఒప్పందాలు
- భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి ధీమా

5

అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు సమీప భవిష్యత్‌లో వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు.ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు.

# గ్లోబల్ లీడర్ భారత్ కావాలి



## ఏఐ విప్లవానికి హైదరాబాద్ వార్ రూమ్

**కేంద్రంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి**

**మానవ మేధస్సుకు ఏఐ సవాల్.. ▪ అవకాశాలను అందుకుందాం**

**ఢిల్లీ ఏఐ సమ్మిట్‌లో ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి**

"గతంలో పారిశ్రామిక విప్లవం, సాఫ్ట్‌వేర్ విప్లవాలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో, ఇప్పుడు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) విప్లవం కూడా అదే స్థాయిలో మానవ పరిణామ క్రమాన్ని మలుపు తిప్పబోతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో శుక్రవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏఐ రంగంలో భారత్ ప్రపంచ నాయకత్వం వహించేందుకు పలు కీలక ప్రతిపాదనలు చేశారు."

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చింది. ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం నడుస్తోందని, అందులో భాగమే ఏఐ విప్లవమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి. ఏఐ అభివృద్ధి కోసం ప్రత్యేకమైన వార్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.. ఏఐ వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశం. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే సకల వసతులతో ఏర్పాటు చేశామని అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. మానవ చరిత్రలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఎలా మార్చాయో ప్రస్తావించారు. ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక సాంకేతికతేనని, ఇది కేవలం ఇంకొక టెక్నాలజీ కాదని, మానవ పరిణామ క్రమంలో అత్యంత శక్తివంతమైన మలుపని అభివర్ణించారు. మునుపటి యంత్రాల మాదిరిగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని, విశ్లేషించ గలదని, నిర్ణయాలు

మిగతా 2 లో



## మండలిలో దేవుడి ఫోటోల ప్రదర్శన

వైకాపా తీరుపై అధికార కూటమి ఆగ్రహం

చైర్మన్ పోడియం వద్ద వైసిపి సభ్యుల నిరసన

వరుస వాయిదాల తరవాత మండలి సోమవారానికి వాయిదా

5



## పబ్జీ ఆడే జగన్‌కు క్రికెట్ గురించి ఏం తెలుసు

హోంమంత్రి అనిత ఘాటు వ్యాఖ్యలు

5



## లడ్డూ కల్తీ వ్యవహారం

సిట్ నివేదికపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

5



## ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులు ఆస్పత్రిపాలు

**గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు**

నోడల్ అధికారుల నియామకానికి ప్రభుత్వం ఆదేశం

2

# రైతులపై పగబట్టారా?

## దేవాదుల మోటార్లు ఎందుకు ఆపారు?

- గోదావరిలో నీరున్నా పొలాలకు ఎందుకు ఇవ్వరు?
- 10 రోజులుగా ఆగిన మోటర్లు.. ఎండిపోతున్న 60 వేల ఎకరాల పంటలు
- సీఎంకు హరీష్‌రావు ప్రశ్న



అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ధ్వజమెత్తారు. దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం పగబట్టినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. శుక్రవారం వరంగల్ జిల్లాలో పర్యటించిన ఆయన, దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద ఆగిపోయిన దేవాదుల మోటర్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

3



2

## కర్రెగుట్టలో పేలిన ఐఈడీ బాంబు

జవాన్‌కు తీవ్ర గాయాలు.. హైదరాబాద్‌కు తరలింపు



## బెంగాల్ సర్ ప్రక్రియ ప్రహసనం

పరస్పర విమర్శలు దురదృష్టకరం

వివాదాల పరిష్కారానికి జ్యుడిషియల్ అధికారుల నియామకం

హైకోర్టుకు ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పర్యవేక్షణ

సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం

4

## అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం

కరాటే కల్యాణి స్పష్టీకరణ

2



# డిజిటల్ గవర్నెన్స్‌లో ఆదర్శం

- 'తెలంగాణ రైజింగ్-2047'లో ట్రాన్స్‌ఫార్మేషన్ టూల్‌గా టెక్నాలజీ
- కృత్రిమ మేధ ప్రజలకు చేరువ కావాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

3




## వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

- డీపీఆర్వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్



3

జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డీపీఆర్వోలను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక ఆదేశించారు. జీఓ 252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.



2

## ఏప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు



# ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థులు ఆస్పత్రిపాలు

**మెదక్, ఫిబ్రవరి 20:** జిల్లాలోని రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగింది. దాంతో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురి కావడంతో ప్రభుత్వం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం గుడ్డు కూర తిన్నారు. అయితే అదే గుడ్డు కూరను రాత్రికి పులుసగా తయారుచేసి విద్యార్థులకు వడ్డించినట్లు తెలుస్తోంది. తద్వారా 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం పది విద్యార్థులు తిరిగి కోలుకున్నట్లు డాక్టర్లు చెబుతున్నారు.

# గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు

**నోడల్ అధికారుల నియామకానికి ప్రభుత్వం ఆదేశం**

**హైదరాబాద్,ఫిబ్రవరి 20:** గురుకుల విద్యార్థుల సంక్షేమంపై తెలంగాణ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించింది. గురుకులాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలోనే నోడల్ అధికారుల నియామకానికి ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ సిద్ధం చేయాలని సూచించింది. జిల్లా షెడ్యూల్ ప్రకారం.. తనిఖీలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆకస్మిక సందర్శనలతో పాటూ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్ణయం తీసుకుంది. తనిఖీ నివేదికలను వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. అధికారులు తీసుకున్న చర్యల వివరాలు వెంటనే తెలియజేయాలని హుకుం జారీ చేసింది. ప్రతి నెలా 5వ తేదీలోపు నివేదిక సమర్పణని తప్పనిసరి చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం

**పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు పోరాడుతా.. • కరాటే కళ్యాణి స్పష్టీకరణ**



**హైదరాబాద్, ఫిబ్రవరి 20:** అన్వేష్‌ను ఇండియా రప్పించడమే లక్ష్యం.. పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు పోరాడుతానని కరాటే కళ్యాణి స్పష్టీకరించారు. హిందూ దేవుళ్లనే కాకుండా.. భారతదేశ ఔన్నత్యాన్ని కించపరిచే విధంగా తెలుగు యూట్యూబర్ 'నా అన్వేషణ' అన్వేశ్ వ్యాఖ్యలు చేశారని ప్రముఖ సినీ నటి కరాటే కళ్యాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్వేశ్ లాంటి వారిని ఉపేక్షించకూడదని హెచ్చరించారు. ఫాలోవర్స్ ఉంటే ఏది మాట్లాడితే అది చెల్లుబాటు అవుతుందని అనుకుంటే కుదరదని వార్నింగ్ ఇచ్చారు. హిందూ దేవుళ్లను కించపరిచినందుకే అన్వేశ్‌పై కేసు పెట్టామని.. తమ ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని కరాటే కళ్యాణి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆమె మాట్లాడుతూ.. అన్వేశ్ జీరోకు వచ్చారని.. ఎక్కడ స్టార్ట్ అయ్యారో.. అక్కడికే రావాలన్నది తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. అన్వేశ్‌లో మేకపోతు గాంభీర్యం కనిపిస్తోందని విమర్శించారు. యూట్యూబ్ పోతే ఫుడ్డు లేదన్న భయం అతనికి పట్టుకుందని కరాటే కళ్యాణి ఎద్దేవా చేశారు. ఇన్‌స్టాగ్రామ్ బ్యాన్ అయ్యాక బుర్ర లేకుండా అతను మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అన్వేశ్ మానసిక స్థితి కూడా బాగోలేదని చెప్పుకొచ్చారు. అన్వేశ్ పాస్‌పోర్ట్ డిపోర్ట్ అయ్యేవరకు తన పోరాటం కొనసాగుతోందని స్పష్టం చేశారు. అన్వేశ్‌ను భారతదేశం రప్పించడమే తమ లక్ష్యమని కరాటే కళ్యాణి పేర్కొన్నారు.

# కర్రెగుట్టలో పేలిన బాంబు

**జవాన్‌కు తీవ్ర గాయాలు..హైదరాబాద్‌కు తరలింపు**

**ములుగు, ఫిబ్రవరి 20:** జిల్లాలోని వెంకటాపురం మండలం తెలంగాణ , చత్తీస్‌ఘడ్ సరిహద్దులోని పామునూరు సమీపంలోని కర్రెగుట్టలో జవానులు సెర్చ్ అపరేషన్ చేస్తుండగా ఐఈడీ బాంబు పేలి జవానుకు గాయాలయ్యాయి. సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కర్రెగుట్టల్లోని పామునూరు, జెల్లా గ్రామాల సమీపంలో 39 బెటాలియన్ సీఆర్పీఎఫ్ బృందాలు శుక్రవారం సెర్చు అపరేషన్ నిర్వహించాయి. ప్రమాదవశాత్తు ఐఈడీ బాంబు పేలి నవజీత్ అనే జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం ఉదయం నుంచి పోలీసు బృందాలు పామూనూరు నుంచి జెల్లా గ్రామానికి రోడ్డు వేసే క్రమంలో 11 ఐఈడీ బాంబులను గుర్తించి నిర్వీర్యం చేశారు. 12 వ బాంబును గుర్తించి నిర్వర్యం చేసే క్రమంలో పేలి ఈ ప్రమాదం జరిగింది. జవాన్ కాలుకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని హుటాహుటినా వెంకటాపురం తరలించి హెలికాప్టర్‌లో మెరుగైన వైద్య కోసం హైదరాబాద్‌కు తరలించారు.



# గ్లోబల్ లీడర్ భారత్ కావాలి

మొదటి పేజీ తరువాయి



తీసుకోగలదని పేర్కొన్నారు. రోబోటిక్స్‌తో కలిసినప్పుడు యంత్రాలు మానసిక మేధస్సుతో పాటు శారీరక సామర్థ్యాన్ని కూడా పొందుతున్నాయని వివరించారు. ప్రపంచ ఏఐ పోటీ ఇప్పటికే ప్రారంభమైందని.. కొన్ని దేశాలు, కంపెనీలు ముందంజలో ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయి. వాటిని భారత్ అందిపుచ్చుకోవాలి. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. ప్రతి ఆరు నెలలకోసారి హైదరాబాద్ వంటి ప్రదేశంలో ఏఐ సదస్సులు జరగాలని రేవంత్ అన్నారు. ప్రపంచంలోని టెక్నాలజీ దిగ్గజాలన్నీ ఈ సదస్సుకు వచ్చాయని, ఆలోచనలే మన జీవితాలను మార్చివేస్తాయని చెప్పారు. మనిషి అత్యున్నత ఆవిష్కరణ అయిన ఏఐ ఫలితాలు మన కోసం చూస్తున్నాయి. మనిషి కంటే ఏఐకి ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం యావత్ ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ముందంజలో నిలవాలంటే కేంద్ర ప్రభుత్వంలో ప్రత్యేక ఏఐ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఏఐ వినియోగం, నియంత్రణ, చట్టపరమైన మార్గదర్శకాలు, జాతీయ భద్రత వంటి అంశాలను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని సీఎం స్పష్టం చేశారు. గత పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన అవకాశ నష్టాలను గుర్తు చేస్తూ, ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని హెచ్చరించారు. సేవలు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో విజయం సాధించిన భారత్, ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా ఏఐ పరిణామాలను నిశితంగా పర్యవేక్షించేందుకు కేంద్ర, రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. కేంద్రం అనుమతిస్తే హైదరాబాద్‌లో అలాంటి వార్ రూమ్ నిర్వహించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రపంచ స్థాయి పరిశోధనలకు ఊతమిచ్చే ఏఐ యూనివర్సిటీని దేశంలో స్థాపించాలని సూచించారు. ఏఐ విస్తరణ నేపథ్యంలో ఉపాధిపై ఉద్భవిస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ.. కొన్ని రంగాల్లో ఉద్యోగ నష్టాలు సంభవించవచ్చని పేర్కొన్నారు. అయితే సరైన రీస్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్ చర్యల ద్వారా ఏఐ వల్ల సృష్టించబడే కొత్త అవకాశాలు మరింత విస్తృతంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యువతను ఏఐ - ఆధారిత భవిష్యత్తుకు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు.స్టార్టప్‌లకు మద్దతు కల్పించేందుకు జాతీయ ఏఐ నిధి ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఏఐ ఆవిష్కరణలకు కేంద్రంగా నిలిచే 'ఏఐ స్టార్టప్ విలేజ్'ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి రాష్ట్రం సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఏఐ రంగంలో విధానాలు, చట్టాలు, నైతిక ప్రమాణాలకు మార్గనిర్దేశర చేసే అత్యున్నత సంస్థగా ఇండియా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.సామాజిక న్యాయం, పేదరిక నిర్మూలన, ప్రజా సేవల మెరుగుదల, జాతీయ భద్రతకు తోడ్పడేలా.. ఏఐ అభివృద్ధి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాధ్యతాయుతమైన, సమ్మిళిత, భవిష్యత్ దృష్టితో కూడిన ఏఐ వ్యవస్థను నిర్మించేందుకు ప్రపంచ నిపుణులు, సంస్థలు కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి కోరారు. ఈ మార్పు యుగంలో భారత్ నాయకత్వం వహించాల్సిన సమయం ఇదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఏప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

**జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ఎస్ఐఆ÷-కు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. ÷ూబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

# ఆయిల్ పామ్ సాగుతో రైతాంగానికి మహర్దశ

- ఈ ఏడాది 1.25 లక్షల ఎకరాల్లో సాగుకు రూ.456 కోట్లు కేటాయింపు
- పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలి
- దేశవ్యాప్తంగా 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలి
- కామారెడ్డి జిల్లాలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌లో మంత్రి తుమ్మల



**కామారెడ్డి, ఫిబ్రవరి 20:** తెలంగాణ రాష్ట్రంలో ఆయిల్ పామ్ సాగుతో రైతాంగానికి మహర్దశ పట్టనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం పాల్వంచమర్రి గ్రామంలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖలతో పాటు హిందుస్తాన్‌యూనిలివర్‌లిమిటెడ్‌ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఆయిల్ పామ్ తోటల కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతు సింగిరెడ్డి బలరాం వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పామ్ మొక్కలు నాటిన అనంతరం మంత్రి మాట్లాడారు. సాంప్రదాయ పంటలతో నష్టాలు ఎదుర్కొంటున్న రైతులకు ఆయిల్ పామ్ సాగు దీర్ఘకాలిక లాభాలను అందిస్తుందని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలంటే దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 2.88 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 32,923 మంది రైతులు 1,05,455 ఎకరాల్లో ఈ పంట సాగు ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు విస్తరణకు రూ.456 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా, సిద్దిపేట జిల్లా నర్మేట్టలో నిర్మాణం పూర్తయిన కర్మాగారం త్వరలో అందుబాటులోకి రానుందని చెప్పారు. ఆయిల్ పామ్ పంట నాలుగేళ్లలో దిగుబడి ఇవ్వడం ప్రారంభించి 30 నుంచి 40 సంవత్సరాల పాటు ఆదాయం అందిస్తుందని పేర్కొన్నారు. రైతులకు ఎకరాకు రూ.51,000 సబ్సిడీ అందిస్తున్నామని, మొక్కలు, ఎరువులు, చుక్కల నీటి సదుపాయం రాయితీపై ఇస్తున్నామని తెలిపారు. ఎకరానికి సంవత్సరానికి రూ.2 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశముందని, మార్కెట్ సమస్యలు లేని పంట ఇదేనని వివరించారు. కామారెడ్డి జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా ఆయిల్ పామ్ సాగును విస్తరించాలని రైతులకు పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల మాదిరిగా కామారెడ్డి జిల్లా కూడా ఆయిల్ పామ్ సాగులో ముందంజలో నిలవాలని సూచించారు. హిందుస్తాన్‌యూనిలివర్‌లిమిటెడ్‌ప్రతినిధి వరుణ్ మెహత మాట్లాడుతూ సాగు, మార్కెటింగ్‌కు పూర్తి సహకారం అందిస్తున్నామని తెలిపారు. చుక్కల నీటి సదుపాయానికి అదనంగా రూ.5,000 ప్రోత్సాహకం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్ మదన్ మోహన్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# సిగరేట్ కాల్చొద్దు అని అన్నందుకు..

- పెట్రోల్ బంకులో నిప్పు పెట్టిన ఉన్మాది!
- బైక్ ట్యాంకులోకి వెలిగించిన లైటర్ విసిరిన వైనం.. ఇద్దరు నిందితుల అరెస్ట్



**రాయ్‌పూర్, ఫిబ్రవరి 20 :** పెట్రోల్ బంకులో నిప్పు రాజేయడం ఎంత ప్రమాదకరమో తెలిసినా.. కేవలం సిగరెట్ కాల్చొద్దని చెప్పినందుకు ఒక వ్యక్తి పెట్రోల్ బంకుకే నిప్పు పెట్టిన భయానక ఘటన ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో చోటుచేసుకుంది. మంటలు ఎగసిపడుతున్న సమయంలో సిబ్బంది అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. రాయ్‌పూర్‌లోని ఉర్లా ప్రాంతంలో ఉన్న ఒక పెట్రోల్ బంకు వద్దకు ఫిబ్రవరి 18న రాత్రి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చారు. సిబ్బంది బైక్‌లో పెట్రోల్ నింపుతుండగా, వెనుక కూర్చున్న వ్యక్తి కిందకు దిగి నిబంధనలకు విరుద్ధంగా సిగరెట్ వెలిగించేందుకు ప్రయత్నించాడు. అది గమనించిన బంకు ఉద్యోగి.. ఇక్కడ సిగరెట్ కాల్చడం ప్రమాదకరమని, కాల్చవద్దని వారించాడు. సిబ్బంది వారించడంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన ఆ వ్యక్తి, తన చేతిలో ఉన్న లైటర్‌ను వెలిగించి ఏకంగా పెట్రోల్ నిండుతున్న బైక్ ట్యాంకులోకి విసిరాడు. క్షణాల్లోనే పెట్రోల్ ట్యాంకు నుండి భారీగా మంటలు ఎగసిపడ్డాయి. ఒక్కసారిగా మంటలు రావడంతో బైక్ నడుపుతున్న వ్యక్తి, బంకు సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ప్రమాదాన్ని పసిగట్టిన మరో ఉద్యోగి వెంటనే ఇంధన సరఫరాను నిలిపివేసి, అగ్నిమాపక పరికరంతో మంటలను ఆర్పివేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పారిపోతున్న నిందితులను బంకు సిబ్బంది చాకచక్యంగా పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితులను ధర్మేంద్ర సింగ్, ఇమ్రాన్ ఖురైషిగా గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. వారి బైక్, లైటర్‌ను స్వాధీనం చేసుకుని, హత్యాయత్నం, పేలుడు పదార్థాల చట్టం కింద పలు సెక్షన్లతో కేసు నమోదు చేశారు. ఈ దృశ్యాలన్నీ బంకులోని సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# దేవాదుల మోటర్లు ఆపి రైతులపై పగబట్టారా?

- గోదావరిలో నీరున్నా పొలాలకు ఎందుకు ఇవ్వరు?
- 10 రోజులుగా ఆగిన మోటర్లు.. ఎండిపోతున్న 60 వేల ఎకరాల పంటలు
- రైతు భరోసాపై సీఎం రేవంత్‌కు హరీష్‌రావు సూటి ప్రశ్న



**వరంగల్, ఫిబ్రవరి 20:** అన్నదాతల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ధ్వజమెత్తారు. దేవాదుల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు నీరు ఇవ్వకుండా ప్రభుత్వం పగబట్టినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. శుక్రవారం వరంగల్ జిల్లాలో పర్యటించిన ఆయన, దేవన్నపేట పంప్‌హౌస్ వద్ద ఆగిపోయిన దేవాదుల మోటర్లను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గోదావరిలో నీరు వృథాగా పోతున్నా, దేవన్నపేటలో మూడు మోటర్లు పది రోజులుగా ఎందుకు పనిచేయడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. "గతంలో మంత్రులు వచ్చి మోటర్లు ప్రారంభిస్తామని ఫోజులిచ్చి వెళ్లారు తప్ప, ఇప్పటికీ అవి తిరగడం లేదు. కనీసం కాలువలు కూడా తవ్వలేకపోయారు. దీనివల్ల 60 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో దేవాదుల థర్డ్ ఫేస్ పనులు పూర్తి చేసి, ఆయకట్టును 3.17 లక్షల ఎకరాలకు పెంచామని, కానీ కాంగ్రెస్ వచ్చాక కనీసం పైసా ఖర్చు చేయడం లేదని దుయ్యబట్టారు. రైతు భరోసా నిధుల విడుదలపై ప్రభుత్వం చేస్తున్న తాత్సారాన్ని హరీష్ రావు తప్పుపట్టారు. మున్సిపల్ ఎన్నికల కోడ్ ముగియగానే 17వ తేదీన రైతు బంధు (రైతు భరోసా) ఇస్తామని చెప్పి, నేడు 20వ తేదీ వచ్చినా ఎందుకు నిధులు వేయలేదని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. "రైతు బంధు ఎప్పుడు ఇస్తారు? నాట్లు వేసేటప్పుడా లేక కోతలు జరిగేటప్పుడా? బడా కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్ల కోసం రూ. 20 వేల కోట్ల బకాయిలు చెల్లించిన సర్కార్‌కు, రైతులకు వేయడానికి డబ్బులు లేవా?" అని ఆయన నిలదీశారు. 2026 మార్చి కల్లా దేవాదుల పూర్తి చేస్తామని చెప్పిన మంత్రులు ఇప్పుడు ఎక్కడికి పోయారని హరీష్ రావు ప్రశ్నించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు రూ. 7,300 కోట్లు ఖర్చు చేసి 80 శాతం పనులు పూర్తి చేశామని, మిగిలిన 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం రూ. 100 కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## హామీల అమలుకు తగ్గట్లుగా బడ్జెట్ ఉండాలి

**సిద్దిపేట, ఫిబ్రవరి 20:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేలా బడ్జెట్‌లో సరైన కేటాయింపులు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా బడ్జెట్ రూపొందించాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజుల్లో ఆరు హామీలు అమలు చేస్తామని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇచ్చిన హామీల పరిస్థితి ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 800 రోజులు దాటినా ఒక్క హామీ కూడా అమలు కాలేదని విమర్శించారు. వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ.4,000 పెన్షన్ ఇస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని చెప్పి ఒక్కరికి కూడా చెల్లించలేదని ఆరోపించారు. రాబోయే బడ్జెట్‌లో మహిళలకు, పింఛన్ దారులకు నిధులు కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు. విద్యార్థులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ చదువులకుగాను ఆర్థిక సహాయం ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లు అమలు కాలేదని విమర్శించారు. రైతులకు ఏటా ఆర్థిక సాయం, పంటల బీమా, బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేశారని ఆరోపించారు.

# డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణ ఆదర్శం

- 'తెలంగాణ రైజింగ్-2047'లో ట్రాన్స్‌ఫార్మేషన్ టూల్‌గా టెక్నాలజీ
- కృత్రిమ మేధ ప్రజలకు చేరువ కావాలి
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 20 :** ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, బ్లాక్ చెయిన్ లాంటి కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ ను సామాన్యుడికి చేరువ చేసి... డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చి దిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. 'తెలంగాణ రైజింగ్ 2047' లక్ష్య సాధనలో టెక్నాలజీని కేవలం ఓ సాఫ్ట్వేర్ గా మాత్రమే కాకుండా... ఓ ట్రాన్స్ ఫార్మేషన్ టూల్‌గా మార్చుకుంటున్నామన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న ప్రణాళికలను న్యూఢిల్లీ భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో భాగంగా శుక్రవారం 'ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్: ఏఐ ఫర్ గవర్నమెంట్ సర్వీసెస్ అండ్ క్లైమేట్ రెసిలియెన్స్' అంశంపై నిర్వహించిన ప్రత్యేక చర్చా కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. పౌర సేవలకు టెక్నాలజీని అనుసంధానం చేసి... ప్రభుత్వానికి, పౌరులకు మధ్య ఉండే దూరాన్ని తగ్గించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఐకం, ఏఐ ఆధారిత తెలంగాణ డిజిటల్ ఎక్స్ఛేంజ్, భూ భారతి లాంటి విప్లవాత్మక సంస్కరణలు డిజిటల్ గవర్నెన్స్ లో తెలంగాణ బ్రాండ్ ను సుస్థిరం చేస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతిక ఫలాలను కేవలం ఓ ప్రాంతానికో లేదా వర్గానికో పరిమితం చేయకుండా అందరికీ చేరువ చేసేలా 'ఏజెంటిక్ ఏఐ' వినియోగంపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. టెక్నాలజీని కేవలం గవర్నెన్స్ కు మాత్రమే పరిమితం చేయకుండా వ్యవసాయం, వాతావరణ మార్పులు, ఆరోగ్యం, సుస్థిర నగరాల అభివృద్ధి, క్లీన్ ఎనర్జీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర రంగాలకూ విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తెలంగాణా అవకాశాల గని.. అపారమైన టాలెంట్ పూల్ మా బలం అని మంత్రి అన్నారు. తెలంగాణలో ఏఐ పరిశోధలు, ఆవిష్కరణలకు ప్రభావశీలమైన టాలెంట్ పూల్ ఉందని తెలిపారు. ఏఐ సమ్మిట్ లో స్వీడెన్ వాణిజ్య ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. కృత్రిమ మేథ వెల్లువ వల్ల ఎదురయ్యే సవాళ్లను, అది తీసుకువచ్చే అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మా ప్రభుత్వం ముందే సంసిద్ధమైంది. దానికి తగ్గట్టుగా సాఫ్ట్ వేర్ నిపుణుల నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు ప్రారంభించాం. ఇదిలావుంటే ఏఐతో ఉద్యోగ విధుల్లో గణనీయమైన మార్పులు వస్తాయి. అందుకు అవసరమైన సన్నధను మొదలు పెట్టింది మా ప్రభుత్వమే. ఏఐ పరిశోధన కేంద్రాలు, అప్లికేషన్లు, సేవల వల్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. యువత దీనిని అందిపుచ్చుకోవాలి. యువత, వృత్తి నిపుణులు మరింత సృజనాత్మక బాధ్యతలు చేపట్టేందుకు ఏఐ అపారమైన అవకాశాలను సృష్టిస్తుంది. స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్ అనేది రెండేళ్లుగా మేం మంత్రంలా జపిస్తున్నాం. ప్రభుత్వ సేవలు, సంక్షేమ కార్యక్రమాల్లో ఏఐ వినియోగం వల్ల లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెరుగుతుంది. దుర్వినియోగానికి ద్వారాలను మూసివేస్తుంది. ఇందుకు అవసరమైన అప్లికేషన్లను రూపొందించడం, నూతన ఆవిష్కరణలను చేపట్టేందుకు గ్లోబల్ టెక్ కంపెనీలు ముందుకు రావాలని అన్నారు. కృత్రిమ మేథ ఫలాలను ప్రజలందరి వద్దకు చేర్చేందుకు ప్రతి గ్రామానికి ఇంర్నెట్ కనెక్టివిటీని అందించే బృహత్తర యజ్ఞం ఇప్పటికే మొదలైంది. టీ-ఫైబర్ ప్రతి గ్రామాన్ని ప్రపంచంతో కనెక్ట్ చేసేందుకు రెండేళ్లుగా శ్రమిస్తోంది. ఏఐ ఓ గేమ్ ఛేంజర్. దాన్ని మచ్చిక చేసుకోవాలి. మన నైపుణ్యాలకు పదును పెట్టుకుని దానిని నియంత్రణలోకి తెచ్చుకోవాలి. పెట్టుబడులకు తెలంగాణా స్వర్గధామం లాంటిది. కొత్తదనానికి రాష్ట్రం ఎప్పుడూ స్వాగతం పలుకుతూ ఉంటోంది. దీనికి అనుకూలమైన ఎకోసిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేశాం. నిరంతర విద్యుత్తు సరఫరా, స్థిరమైన విధానాలు అమలు చేస్తున్నాం అని వివరించారు.

# వారం రోజుల్లో జిల్లాస్థాయి అక్రిడేషన్ కమిటీలు

### డీపీఆర్వోలను ఆదేశించిన స్పెషల్ కమిషనర్



**హైదరాబాద్, ఫిబ్రవరి 20 :** జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డీపీఆర్వోలను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ పక్రియ విధి విధానాలపై డీపీఆర్వోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిఓ నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని డీపీఆర్వోలకు సూచించారు. జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల పక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ పక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓ.లను ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమిషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓ.లు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు.



## కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డికి అస్వస్థత

### హుటాహుటిన హైదరాబాద్ నిమ్స్‌కు తరలింపు

**హైదరాబాద్, ఫిబ్రవరి 20:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, జీవన్ రెడ్డి ఇటీవల కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్ లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్, జీవన్ రెడ్డి మధ్య వర్గపోరు కొనసాగుతోంది. ఒక దశలో పార్టీని కూడా వీడుతానని జీవన్ రెడ్డి అలకబూనడంతో అధిష్ఠానం బుజ్జగింపులతో వెనక్కి తగ్గారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సైతం తన వర్గం అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకున్నాడు. సీనియర్ అయిన తనను సరిగా గౌరవం ఇవ్వడం లేదని అసృంతృప్తికి లోనవుతున్నాడు. జీవన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## జీవన్ రెడ్డి మర్యాదకు భంగం కలిగించకండి

### కాంగ్రెస్ అధిష్టానానికి జగ్గారెడ్డి వినతి



**హైదరాబాద్, ఫిబ్రవరి 20:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ కష్ట కాలంలో పార్టీతో ఉన్న జీవన్ రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా పార్టీ హైకమాండ్ చొరవ తీసుకోవాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. జగ్గారెడ్డి తాజాగా మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నా. జీవన్ రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయారు. కాంగ్రెస్ పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పార్టీలోనే ఉన్నాడు. రాజకీయంగా జీవన్ రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. కష్ట కాలంలో పార్టీలో ఉన్న జీవన్ రెడ్డికి అవమానం జరగకుండా కాంగ్రెస్ పెద్దలు చొరవ చూపాలి. జీవన్ రెడ్డికి గౌరవం వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరుతున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో, జీవన్‌రెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఫుడ్ పాయిజన్ అయిందని జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్టు సమాచారం.



## సీఎం కప్ - 2025 సెకండ్ ఎడిషన్ ప్రారంభం

### గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభించిన మంత్రి శ్రీహరి

### క్రీడాకారులను ప్రోత్సహించే లక్ష్యంతో సాగుతున్నామని వెల్లడి

**హైదరాబాద్,ఫిబ్రవరి 20:** సీఎం కప్-2025 సెకండ్ ఎడిషన్ అట్టహాసంగా ప్రారంభంఅయ్యింది. మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి సోనీ బాలాదేవి, క్రీడా శాఖ అధికారులు ప్రారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. తెలంగాణలోని 33 జిల్లాల నుంచి వివిధ స్కూల్స్, కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థుల మార్చ్ తో మంత్రి వాకిటి శ్రీహరి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా లేజర్ షో, శివమణి ప్రదర్శన ఆకట్టుకున్నాయి. సీఎం కప్ 2025 సెకండ్ ఎడిషన్ ను ప్రారంభిస్తున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. రాష్టాన్ని క్రీడల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చారన్నారు. ఆటల్లో క్రమశిక్షణ ఉంటేనే విజయం సాధ్యం అన్నారు. అంతర్జాతీయ పోటీల్లో క్రమశిక్షణ లేకపోవడం వల్లనే విజయాలు సాధించలేకపోతున్నాం అన్నారు. క్రీడల్లో స్వార్థం, నైపుణ్యం ఉంటేనే రాణిస్తాం. బాల్యంలో ఒక లక్ష్యం పెట్టుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంది. ప్రతి క్రీడాకారుడు ఆటల మీద దృష్టి సారించాలి. ఆడాలనే కసి ఉంటేనే దేశం తరపున ఆడే అవకాశం వస్తుంది. ఆటలో లీనమై, అదే ప్రపంచం అనుకోని ముందుకు నడవండి అప్పుడే జీవితం బాగుటుంది. గత ప్రభుత్వాలు ఆటలను పట్టించుకోలేదు. తెలంగాణ అంతటా క్రీడా స్ఫూర్తి నింపాలని ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారని వివరించారు. ఆటలను టైం పాస్ గా కాకుండా విజయం సాధించే దిశగా అడుగులు వేయండి. దేశం, రాష్ట్రం తరుపున ఆడాలనే స్ఫూర్తి ఉండాలని సూచించారు. ఇకపోతే సీఎం కప్ -2026 సెకండ్ ఎడిషన్ కార్యక్రమం సందర్భంగా నేషనల్ మాస్టర్స్ అ÷-లథెట్స్ అసోసియేషన్ కు సంబంధించిన వివిధ విభాగాల్లో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి మెడల్స్ సాధించిన అథ్లెట్స్ ను క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అభినందించారు. వివిధ అ÷-లథెట్స్ లో మెడల్స్ సాధించి భారత, తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అథ్లెట్స్ ను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.



## సంపాదకీయం

# ఎన్నికల ఫలితాలు పనితీరుకు గీటురాయి కాదు!

**రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రయోజనాత్మక నిర్ణయాలు ఇంకా తీసుకోలేదు. అయితే వరుస ఎన్నికల్లో గెలవడం వల్ల అధిష్టానం వద్ద మార్కులు కొట్టేశారు. మంత్రులంతా కలసి కాంగ్రెస్ అగ్రనేతలు ఖర్గే, రాహుల్‌ను కలిసి శహభాష్ అనిపించుకున్నారు. ఇలాగే పనిచేయండని కాంగ్రెస్ అగ్రనేతలు దీవించి పంపారు. ఇది మాత్రమే కాంగ్రెస్ విజయం కాదు.**

ఢిల్లీలో కూర్చున్న నేతలకు రాష్ట్రం ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన లేదు. సిఎం రేవంత్ కూడా క్షేత్రస్థాయి సమస్యలపై ఇంకా దృష్టి సారించలేదు. ప్రధానంగా తాగు,సాగునీటి సమస్యలు, రైతుల నుంచి ధాన్యం సేకరణ, గిట్టుబాటు ధరలు అందించడం, నిరుద్యోగ సమస్యలు తీర్చడం వంటివన్నీ ప్రధానంగా వెన్నాడుతున్నాయి. క్షేత్రస్థాయిలో తెలంగాణలో అనేకానేక సమస్యలు వెన్నాడుతున్నాయి. కెసిఆర్ ప్రభుత్వం ఉన్న సమయంలో ఉన్న సమస్యలే ఇంకా ఉన్నాయి. అవేవీ పరిష్కారం కాలేదు. రేవంత్ సర్కార్‌పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వ్యాపించిన తరుణంలో మునిసిపల్ ఎన్నికలు జరిగాయి. అంతకు ముందు పంచాయితీ, ఇంకా అంతకుముందు రెండు ఉప ఎన్నికలు జరిగాయి. వీటన్నింటిలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలనకు గీటురాయి కాబోవు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వంపై కొంత కాలంగా విరుచుకుపడుతోంది. రేవంత్‌రెడ్డి సర్కార్ పనైపోయినట్టేనని ప్రచారం చేస్తోంది. ఆ పార్టీ నాయకులు అది నిజమని కూడా నమ్ముతున్నారు. ఈ ప్రచారానికి తోడు ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినందున ఇటీవలి వరుస ఎన్నికల ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే బిఆర్ఎస్ అంచనాకు భిన్నంగా కాంగ్రెస్ పార్టీ మంచి ఫలితాలు సాధించింది. కేటీఆర్,హరీష్ రావులుకు ఈ ఫలితాలు ఓ రకంగా హెచ్చరిక లాంటివి. ఎందుకంటే గత పాలనలో తాము చేసిన పాపాలను పక్కన పెట్టి అదేపనిగా విమర్శలు చేస్తూ పోతే ప్రజలు ఆదరిస్తారని అనుకుంటున్నారు. ప్రజలు అన్ని విషయాలు తెలుసుకుంటున్నారు. ఏవరేమిటో గ్రహిస్తున్నారు. అయితే సిఎం రేవంత్ అందరినీ కలుపుకుని వరుస విజయాలను సాధిస్తున్నారు. కాంగ్రెస్ అంటేనే అసమ్మతి గుర్తుకు వస్తుంది. ఆ పార్టీలో ఎవరికి వారే ముఖ్యమంత్రి స్థాయి నాయకులమని భావిస్తారు. ఏక నాయకత్వాన్ని అంగీకరించరు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఇప్పటికీ తమ నేతగా అంగీకరించడం లేదు. కాంగ్రెస్ పార్టీలో ఆయన జూనియర్ అని పలువురు వ్యాఖ్యానిస్తూనే ఉన్నారు. కాంగ్రెస్‌లో సీనియర్లం అని భావిస్తున్న వాళ్లు రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని ఇప్పటికీ అంగీకరించడం లేదు. లాటరీ తగిలినట్టు రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని బిఆర్ఎస్ చేస్తున్న ముఖ్యంగా కెటిఆర్ చేస్తున్న ఆరోపణఅలను వీరు కూడా భావిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎవ్వరినీ నొప్పించకుండా వెళుతోంది. అందుకే కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంది. అయితే, రేవంత్‌రెడ్డి మాత్రం వ్యూహాత్మకంగా పార్టీలో, ప్రభుత్వంలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూ, అగ్ర నాయకకతంవ ముందు మార్కులు కొట్టేస్తున్నారు. సందర్భం వచ్చినప్పుడు తనకున్న పట్టు ఏమిటో నిరూపించుకుంటున్నారు. మునిసిపల్ ఎన్నికల్లో మంత్రులందరికీ జిల్లాల వారీగా బాధ్యతలు అప్పగించి సమన్వయం చేసుకొని సత్ఫలితాలను సాధించారు. దాదాపు అన్ని జిల్లాల్లోనూ మంచి ఫలితాలను సాధించేలా రేవంత్‌రెడ్డి వ్యూహ రచన చేశారు. తనకంటే ఎంతో మంది సీనియర్లున్న కాంగ్రెస్‌ను ఏక తాటిపై నడిపించడంలోనూ రేవంత్‌రెడ్డి కృతకృత్యులయ్యారు. కాంగ్రెస్ సీనియర్లు కూడా తన నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితిని కల్పిస్తూ వస్తున్నారు. రాజకీయాల్లో పార్టీలకైనా, నాయకులకైనా ఎన్నికల ఫలితాలే గీటురాయి. మొన్న పంచాయతీ ఎన్నికలు, నిన్న మునిసిపల్ ఎన్నికల్లో 60 శాతంపైగా స్థానాలను కైవసం చేసుకోవడం ద్వారా తన నాయకత్వ విషయంలో ఎదురవుతున్న ఆటంకాలను ఆయన అధిగమిస్తూ వచ్చారు. ఈ ఫలితాలతో పాటు తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలు ముఖ్యమంత్రిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నట్టుగా ఉంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం కూడా రేవంత్ భుజం తట్టి ప్రోత్సహించింది. శహభాష్ అంటూ పొగిడింది. ఇలాగే నడవండి అంటూ అందరినీ కలిపి సూచించింది. అయితే ఇవొక్కటే రేపటి గెలుపునకు బాటలు వేయవు. గుణాతమక మార్పులు రావాలి. చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించడం లేదు. మంత్రులు వసూల్ రాజాలుగా మారారని పుంఖానుపుంఖానుగా ఆరోపణలు వస్తున్నాయి. పర్సంటేజీలకు అలవాటు పడ్డారని అంటున్నారు. ప్రభుత్వంలో సమన్వయం, జవాబుదారీతనం పెంపొందించాలి. అదే సమయంలో ప్రభుత్వంలో వివిధ స్థాయిల్లో అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతిని తగ్గించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలి. మంత్రుల తీరు కూడా ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా ఉంటోంది. ఈ అంశంపై కూడా ముఖ్యమంత్రి దృష్టి సారించాలి. ఉద్యోగుల్లో లంచావతారాలు పెరిగాయి. విద్యుత్ శాఖలో ఏకబిగిన ఓ 9మందిని సస్పెండ్ చేశారు. రోజుకోచోట్ ఎక్కడో ఒక ఉద్యోగి లంచం తీసుకుంటూ పట్టుబడుతున్నాడు. ఈ సమస్య పోవాలి. గంజాయి బ్యాచ్‌లను నిరోధించాలి. అయితే ఇల్లు అలకగానే పండుగ కాదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించినంత మాత్రాన సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని భావించడానికి లేదు. ఈ ఫలితాలు ప్రభుత్వంలో, పార్టీలో రేవంత్‌రెడ్డి స్థానం మరింత పటిష్ఠమవడానికి మాత్రమే ఉపయోగపడతాయి. సార్వత్రిక ఎన్నికలకు ఇంకో మూడేళ్ల వ్యవధి ఉంది. 2029లో జమిలి ఎన్నికలు వస్తాయని చెబుతున్నారు. అది నిజమైతే బీఆర్ఎస్‌కు మైనస్ అవుతుంది. వచ్చే మూడేళ్లలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోగలగాలి. అందుకు కార్యాచరణ అవసరం.

# బెంగాల్ సర్ ప్రక్రియ ప్రహసనం

- పరస్పర విమర్శలు సాగడంపై దురదృష్టకరం
- వివాదాల పరిష్కారానికి జ్యుడిషియల్ అధికారుల నియామకం
- హైకోర్టుకు ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పర్యవేక్షణ
- సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** ఓటర్ రోల్ క్లీన్-అప్ డ్రైవ్ విషయంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ మధ్య పరసర్ప నిందారోణపలు చోటుచేసుకోవడం, ఎస్ఐఆర్ పక్రియపై సంక్లిష్ట పరిస్థితులు తలెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు శుక్రవారంనాడు సంచలన నిర్ణయం తీసుకుంది. ఓటర్ల జాబితాల సవరణపై దురదృష్టకరమైన విమర్శల ఆట కొనసాగుతోందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఓటర్ల జాబితాల సవరణ పక్రియను పర్యవేక్షించేందుకు న్యాయాధికారులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఎస్ఐఆర్‌లో అభ్యంతరాలు, వివాదాలను జ్యుడిషియల్ ఆఫీసర్లు పరిష్కరిస్తారని పేర్కొంది. రాజ్యాంగ బద్ధ వ్యవస్థలైన రాష్ట్రం, ఎన్నికల కమిషన్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం నడుస్తోంది. దీంతో ఎస్ఐఆర్ పక్రియ అభ్యంతరాలు, వివాదాల మధ్య చిక్కుకుంది' అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కోసం పనిచేస్తున్న జిల్లా జడ్జి హోదాలో ఉన్న మాజీ న్యాయాధికారులను కూడా ఈ పక్రియ కోసం నియమించాలని, అసాధారణ పరిస్థితుల కారణంగా అసాధారణ ఉత్తర్వులు జారీ చేయాల్సి వచ్చిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. న్యాయాధికారుల నియామకం, బాధ్యతలకు సంబంధించి సమగ్ర ప్లాన్ కోసం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో శనివారంనాడు సమావేశం కావాలని ఎన్నికల కమిషనర్, చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్, ఇతర ఉన్నతాధికారులను సుప్రీంకోర్టు ఆదేశించింది. జ్యుడిషియల్ ఆఫీసర్లు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడంపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు వేసింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఆశించాం. కమ్యూనికేషన్ విషయంలో వ్యవహరించే తీరు ఇదేనా? ఫిబ్రవరి 9 ఆదేశాలకు ఫిబ్రవరి 17న స్పందించారు. 8,500 ఆఫీసర్లను పంపామంటారు. మేము మైక్రో అబ్జర్వర్లం కాదు. ఈ వ్యవహారం మాకు తీవ్ర అంసతృప్తిని కలిగిస్తోంది. రాష్ట్రాలు సహకరిస్తాయని మేము భావిస్తాం. మాకు ప్రైవేటు వివరణలు అవసరం లేదని సీజేఐ అన్నారు. ఎస్ఐఆర్‌పై జరుపుతున్న పోరాటాన్ని ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఇటీవల ఢిల్లీకి తీసుకువెళ్లారు. ఎన్నికల కమిషన్ ఉన్నతాధికారులతో సమావేశానంతరం బహిరంగంగానే ఆమె హెచ్చరికలు చేశారు. ఎన్నికల కమిషన్ ముందు లక్షలాది మంది బాధితులను పెరేడ్ చేయిస్తామన్నారు. మమతా బెనర్జీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారంటూ ఈసీ మండిపడింది. ఎన్నికల అధికారులు ఎంతో సంయమనంతో గౌరవంతో ఆమెతో మాట్లాడినట్టు తెలిపింది. అయితే బెంగాల్ ఓటర్ల జాబితా క్లీనప్ పేరుతో నిజమైన ఓటర్లను జాబితా నుంచి మినహాయించారని మమతా బెనర్జీ ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన అస్సాంలో ఎందుకు ఎస్ఐఆర్ పక్రియ నిర్వహించలేదని నిలదీశారు. బీజేపీ ఏజెంట్‌గా ఈసీ వ్యవహరిస్తోందని తప్పుపట్టారు.

# ఏలియన్స్ గుట్టు బయటపెడతాం

- వాటికి సంబంధించిన ఫైళ్లను వెల్లడిస్తాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడి




**వాషింగ్టన్, ఫిబ్రవరి 20:** అమెరికాలో ఏలియన్స్, యూఎఫ్‌ఓలకు సంబంధించిన ప్రభుత్వ ఫైళ్లను విడుదల చేసే పక్రియను ప్రారంభించాలని ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశించారు. గ్రహాంతరవాసులు, గుర్తుతెలియని ఎగిరే వస్తువులకు సంబంధించిన రహస్య ఫైళ్లను గుర్తించి.. వాటిని బహిర్గతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ట్రంప్ తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో గ్రహాంతర వాసుల ఉనికిపై దశాబ్ద కాలంగా సాగుతున్న అమెరికన్ల ఉత్కంఠకు తెరపడనుంది. ప్రజల్లో ఈ రహస్యాల పట్ల ఉన్న ఆసక్తిని తీర్చాలని భావించే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తన ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ పేర్కొన్నారు. యూఎస్ మాజీ ప్రెసిడెంట్ బరాక్ ఒబామా.. గ్రహాంతరవాసులు ఉన్నారని ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యానించడంతో ఈ వివాదం రాజుకుంది. దీనిపై ఒబామా నాడు మాట్లాడుతూ.. 'గ్రహాంతర వాసులు ఉన్నది నిజమే కావచ్చు. కానీ నేనెప్పుడూ వారిని చూడలేదు' అని అన్నారు. అమెరికాలోని ఏరియా 51లో వారిని దాచిపెట్టారనే ప్రచారంలో ఎలాంటి వాస్తవమూ లేదని ఆయన వ్యాఖ్యానించారు. తన పదవీ కాలంలో ఏలియన్స్ భూమిపై సంచరించినట్టు ఎలాంటి ఆధారాలూ లభించలేదని స్పష్టం చేశారు. అయితే.. ఈ సమాచారాన్ని ఒబామా బహిర్గతం చేయడాన్ని తప్పుబట్టారు ట్రంప్. క్లాస్టి÷డ్ సమాచారాన్ని బయటపెట్టి ఒబామా పెద్ద తప్పుచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైరల్ అయిన ఒబామా 'ఏరియా 51' వ్యాఖ్యలను ట్రంప్ ఉదహరిస్తూ.. 'ఏలియన్స్‌లో ఎవరున్నారో నిజంగా నాకు తెలియదు. కానీ ప్రభుత్వం వద్దనున్న సమాచారాన్ని మాత్రం బయటపెడతాను' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. గ్రహాంతర సాంకేతికతకు సంబంధించి తమ వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదని 2024 మార్చిలో పెంటగాన్ ఓ నివేదికలో పేర్కొంది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం.. వాటికి సంబంధించిన సమాచారమేమీ లేదని.. ఆకాశంలో కనిపించిన వింత వస్తువులు సహజమైనవి కావచ్చని స్పష్టం చేసింది. కానీ దీనిపై ఇప్పుడు ట్రంప్ సెక్రటరీ ఆఫ్ వార్ సహా ఇతర ఏజెన్సీ సంస్థలను రంగంలోకి దింపి ఈ రహస్య పక్రియను ఛేదించేందుకు యత్నించడం చర్చనీయాంశమైంది. అయితే.. ఈ రహస్య పత్రాలను ప్రజల ముందుకు తీసుకువస్తారా లేదా అనే విషయమై ఎలాంటి స్పష్టతనివ్వలేదు ట్రంప్. ఈ÷ళ్లైలో అత్యంత సంక్లిష్టమైన, ఆసక్తికరమైన, ముఖ్యమైన విషయాలకు సంబంధించిన సమాచారం ఏది ఉన్నా బహిర్గతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏది ఏమైనా ట్రంప్ తాజా నిర్ణయంతో.. అంతరిక్షంలో ఉన్న ఇతర జీవుల ఉనికిపై అమెరికా ప్రభుత్వ అధికారిక వైఖరి ఏంటనే దానిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతో ఎన్నో ఖగోళ విషయాలు బయటకు వస్తాయని, చాలా మందికి అంతుచిక్కని ప్రశ్నలకు సమాధానం లభించనుందని శాస్త్రవేత్తల్లో ఆసక్తి నెలకొంది.

## బ్రిటన్‌లో ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్‌పై తీవ్ర దుమారం

### మాజీ యువరాజు ఆండ్రూ సమక్షంలోనే బాలికకు కరెంట్ షాక్

**లండన్, ఫిబ్రవరి 20:** ఎప్‌స్టీన్ సెక్స్ రాకెట్ బ్రిటన్‌లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ వ్యవహారంలో ఆ దేశ రాజ కుటుంబానికి చెందిన మాజీ యువరాజు ఆండ్రూ మౌంట్‌బాటెన్- విండ్సర్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఆయన గురించి మరిన్ని ఆరోపణలు బయటకు వచ్చాయి. బ్రిటన్ మీడియా కథనాల ప్రకారం.. ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వయసున్న ఓ బాలికకు సెక్స్ రాకెట్ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చి హింసించాడని, అప్పుడు ఆండ్రూ అక్కడే ఉన్నాడని ఆ కథనాలు పేర్కొన్నాయి. ఆ బాలికను టేబుల్‌పై బంధించి ఈ అరాచకానికి పాల్పడ్డారని ఓ గుర్తుతెలియని వ్యక్తి సమాచారమిచ్చారు. ఈ ఆరోపణలు ఎఫ్‌బీఐ పత్రాల్లో ఉన్నాయి. ఈ ఘటన బ్రిటన్‌లోని ఫ్రాగ్మోర్ కాటేజ్‌లో జరిగిందని ఆ కథనాలు వెల్లడించాయి. అయితే ఆండ్రూ మాత్రం తనపై వచ్చిన ఈ ఆరోపణలను ఎప్పటికప్పుడు ఖండించారు. 1994 నుంచి 1996 మధ్యలో హ్యూమన్ ట్రాఫికింగ్, మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణల గురించి అవగాహన ఉందని సర్రే పోలీసులు వెల్లడించారు. అయితే దానిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు. తమ వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. ఈ రెండు ఘటనలకు సంబంధం లేదని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత ఆరోపణలకు సంబంధించి ఎవరివద్ద అయినా సమాచారం ఉంటే తమకు రిపోర్ట్ చేయాలని కోరారు. కాగా.. అమెరికాలో లైంగిక నేరాలకు పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలు పెట్టుకోవడమే కాకుండా.. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఆరోపణలపై ఆండ్రూను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. కొన్ని గంటలు విచారించిన అనంతరం ఆయన విడుదలయ్యారు. అయితే ప్రస్తుతానికి ఆయనపై ఎలాంటి అభియోగాలు మోపలేదు.








## ఏఐ సమ్మిట్‌లో హైడ్రామా

### చొక్కాలు విప్పి కాంగ్రెస్ కార్యకర్తల వీరంగం!

### భారత్-అమెరికా ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా నినాదాలు

### అంతర్జాతీయ వేదికపై అప్రతిష్ట.. ఇది 'నేషనల్ షేమ్' అంటూ బీజేపీ ఫైర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20:** దేశ రాజధానిలోని భారత్ మండపం వేదికగా ప్రపంచ స్థాయి టెక్ దిగ్గజాలు, విదేశీ ప్రతినిధుల సమక్షంలో జరుగుతున్న 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో శుక్రవారం తీవ్ర కలకలం రేగింది. సదస్సు చివరి రోజున పలువురు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు హాలులోకి దూసుకువచ్చి చొక్కాలు విప్పి నిరసన తెలపడం సంచలనంగా మారింది. శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో హాల్ నంబర్ 5లోకి దాదాపు 10 మంది యువకులు గుంపుగా ప్రవేశించారు. ఒక్కసారిగా తమ చొక్కాలు విప్పేసి, గాలిలో ఊపుతూ కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ముఖ్యంగా "పీఎం ఈజ్‌ప్రామిస్డ్" అని రాసి ఉన్న టీ-షర్టులను ప్రదర్శిస్తూ, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం (ట్రేడ్‌డీల్) వల్ల దేశానికి నష్టం జరుగుతోందని ఆరోపించారు. వీరంతా ఆన్లైన్ ద్వారా ప్రతినిధులుగా రిజిస్టర్ చేసుకుని, లోపల ధరించిన నిరసన టీ-షర్టులపై స్వెటర్లు, జాకెట్లు వేసుకుని భద్రతా సిబ్బందిని బురిడీ కొట్టించినట్లు తెలుస్తోంది.

#### ఇది దేశానికే అవమానం

ఈ ఘటనపై బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది కేవలం నిరసన కాదని, అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను దిగజార్చే "నేషనల్ షేమ్" అని అభివర్ణించారు. "ప్రపంచం మొత్తం భారత్ వైపు చూస్తుంటే, కాంగ్రెస్ ఇలాంటి చిల్లర రాజకీయాలతో దేశాన్ని అప్రతిష్టపాలు చేస్తోంది" అని ధ్వజమెత్తారు. బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా స్పందిస్తూ.. ఇది ఐఎన్సీ కాదు, ఏఎన్సీ (యాంటీ నేషనల్‌కాంగ్రెస్)అని విమర్శించారు. మరోవైపు యువజన కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్ తమ కార్యకర్తల చర్యను సమర్థించారు. నిరుద్యోగం, దేశ ప్రయోజనాలను పణంగా పెట్టే వాణిజ్య ఒప్పందాలపై గళం ఎత్తడం తమ హక్కు అని స్పష్టం చేశారు. అయితే, అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే భారత్ మండపంలోకి నిరసనకారులు ఎలా ప్రవేశించారనే దానిపై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే 10 మందిని అదుపులోకి తీసుకుని తిలక్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వీరికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఏఐ, క్వాంటం హబ్‌గా ఆంధ్రప్రదేశ్

- ప్రపంచపటంలో 'అమరావతి క్వాంటం వ్యాలీ': సీఎం చంద్రబాబు
- ఐబీఎం, యూఎన్ఐసీసీతో కీలక ఒప్పందాలు
- భారత్ మండపంలో 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్'లో ముఖ్యమంత్రి ధీమా



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి20 :** అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచమంతా మాట్లాడే రోజు సమీప భవిష్యత్‌లో వస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకోసిస్టమ్‌కు రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడిటెక్ పార్క్‌లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని వివరించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026లో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ప్రపంచ క్వాంటమ్ – ఏఐ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా తమ ప్రభుత్వం దృష్టి సారిస్తోందని చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఏపీలో స్పేస్, డ్రోన్, ఎలక్ట్రానిక్స్, మెడ్‌టెక్ పార్క్ లాంటి ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించటంతో పాటు.. క్వాంటం ఎకో సిస్టంను తీర్చిదిద్దుతున్నామని వివరించారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్న కృత్రిమ మేథస్సు ద్వారా పోటీతత్వం అంశంపై జరుగుతున్న రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు సీఎం చంద్రబాబు హాజరై.. తన అభిప్రాయాలను పంచుకు న్నారు. ఈ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, వరల్డ్ ఎకనామిక్ ఫోరం సీఈఓ బోర్కే బ్రెండేతో కలిసి పాల్గొన్నారు. సమీప భవిష్యత్‌లో అమరావతి క్వాంటం వ్యాలీ గురించి ప్రపంచం అంతా మాట్లాడే రోజు వస్తుందని చెప్పుకొచ్చారు. గూగుల్ లాంటి సంస్థల రాకతో ఏపీలోని విశాఖపట్నం ఏఐ డేటా హబ్‌గా మారుతుందని తెలిపారు. ప్రపంచానికి క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన పరికరాలను కూడా తయారు చేసేలా క్వాంటం ఎకో సిస్టం రూపకల్పన చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టాలన్న ఆకాంక్షతో ప్రధాని నరేంద్రమోదీ పనిచేస్తున్నారని.. దేశం దాన్ని సాధించి తీరుతుందని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అద్భుతాలను సాధిస్తుందనే విశ్వాసం తమకు ఉందని చెప్పుకొచ్చారు. పౌరులందరికీ ప్రయోజనం కలిగేలా సావరిన్ ఏఐని వినియోగించేందుకు ప్రభుత్వ పరంగా ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. డీప్ టెక్నాలజీ రంగంలో మరింత ముందుకెళ్లేలా ఏపీ దృష్టి సారిస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీలో క్వాంటమ్ – ఏఐ రంగాల్లో నైపుణ్యాభి వృద్ధి, మౌళిక వసతుల అభివృద్ధి కల్పించే దిశగా ఏడు ఒప్పందాలు కుదుర్చుకుంది సర్కార్. ఏపీని క్వాంటమ్ – ఏఐ హబ్‌గా తీర్చిదిద్దడం... అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీకి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేలా ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుంది. భవిష్యత్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా విద్యార్థులు, యువతకు ఏఐ – క్వాంటమ్ రంగాల్లో శిక్షణ, ప్రభుత్వ శాఖల్లో ఏఐ – క్వాంటమ్ వినియోగం, టెక్నాలజీ ద్వారా ప్రజలకు సేవలను సులభతరం చేయడం వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. క్వాంటమ్, ఏఐలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసేందుకు యూనైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి ఏఐ క్వాంటమ్ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ.ఏఐ – క్వాంటమ్ డిజిటల్ ఎంబసీగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను తీర్చిదిద్దేలా ప్రణాళికలు. రాష్ట్ర ప్రభుత్వంతో జరిగిన ఒప్పందం కార్యక్రమానికి యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్ సహా ఆ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు.



## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

### సిట్ నివేదికపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్

### ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**అమరావతి, ఫిబ్రవరి 20:** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఈ ఏకసభ్య కమిటీని ఏపీ సర్కార్ నియమించింది. ఈ కమిటీ ప్రధాన బాధ్యత.. సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం, ఈ ఏకసభ్య కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిట్ నివేదికలో ఉన్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, అవసరమైతే అదనపు వివరాలను సేకరించి.. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది. తిరుమలలో శ్రీవారి లడ్డూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు. అలాంటి పవిత్ర ప్రసాదం విషయంలో కల్తీ ఆరోపణలు రావడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దర్యాప్తు పక్రియను వేగవంతం చేసింది. సిట్ ఇప్పటికే లడ్డూ తయారీ పక్రియ, ముడి సరుకుల సరఫరా, నాణ్యత నియంత్రణ వ్యవస్థ, సంబంధిత అధికారుల పాత్ర వంటి అంశాలపై విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదిక ఆధారంగా ఇప్పుడు ఏకసభ్య కమిటీ మరింత సమగ్రంగా విశ్లేషణ చేయనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## మండలిలో దేవుడి ఫోటోల ప్రదర్శన

### వైకాపా తీరుపై అధికార కూటమి ఆగ్రహం

### ఛైర్మన్ పోడియం వద్ద వైసిపి సభ్యుల నిరసన

### వరుస వాయిదాల తరవాత మండలి సోమవారానికి వాయిదా



**అమరావతి, ఫిబ్రవరి 20:** దేవుడి అంశం శాసనమండలిని కుదిపేసింది. శ్రీ వేంకటేశ్వరస్వామి ఫొటోలతో వైసీపీ సభ్యులు సభలో నిరసనకు దిగడం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. ఈ క్రమంలో సభ వాయిదా పడగా.. కాసేపటికి తిరిగి మొదలైంది. అయితే వైసీపీ క్షమాపణలు చెప్పాలని టీడీపీ డిమాండ్ చేయగా... తాము దేవుడిని అవమానించలేదంటూ వైసీపీ ఎమ్మెల్సీల ఆందోళనతో మరోమారు వాయిదా పడింది. శుక్రవారం ఉదయం వైసీపీ ఇచ్చిన వాయిదా తీర్మాలను ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు తిరస్కరించడంతో.. ఆ పార్టీ ఎమ్మెల్సీలు స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నిరసన చేపట్టారు. వేంకటేశ్వర స్వామి ఫొటోలతో ఆందోళనకు దిగారు. వైసీపీ తీరును మంత్రి పయ్యావుల కేశవ్ తప్పుబట్టారు. వైసీపీ సభ్యుల ఆందోళనతో సభ వాయిదా పడింది. తిరిగి కొద్దిసేపటికి సభ మొదలైనా.. మరోమారు కూటమి సభ్యులు ఆందోళనకు దిగారు. ఛైర్మన్ పోడియం వద్దకు వెళ్లి.. దేవుడిని అవమానించిన వైసీపీ సభ్యులు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేవదేవుడిని వైసీపీ సభ్యులు అవమానించారంటూ కూటమి సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. దేవుడిని తాము అవమానించలేదంటూ వైసీపీ ఎమ్మెల్సీలు పోడియం వద్దకు వచ్చారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. వెంటనే మండలి సమావేశాన్ని ఛైర్మన్ సోమవారానికి వాయిదా వేశారు.



## లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గాలు

### నెయ్యిలో జంతువుల కొవ్వు కలసిందని దుష్ప్రచారం

### మండలిలో చర్చకు ఎందుకు వెనక్కి పోయారు

### చంద్రబాబు లాగా షూస్ వేసుకుని ఫోటోలు పట్టుకోలే

### కూటమి నేతల తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స

**అమరావతి,ఫిబ్రవరి 20 :** చంద్రబాబు దేవదేవుడి ప్రసాదంపై నిందారోపణలు చేశారని.. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి దిగారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. తన స్వలాభం కోసం తమ సంస్థలకు నెయ్యి టెండర్లు ఇప్పించుకోవడం కోసం అసత్యాలు చెప్పారన్నారు. సీబీఐ ఇచ్చిన రిపోర్టులో చాలా విషయాలు బయటికి వచ్చాయని.. హెరిటేజ్‌తో ఒప్పందం చేసుకున్న ఇందాపూర్ డెయిరీ నెయ్యిని సరఫరా చేసింది. 2015–19 మధ్య కల్తీ నెయ్యిని సరఫరా చేసినందుకు ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపారు. అవే ట్యాంకర్లను దాచి మళ్లీ వినియోగించారు. గోవిందా కూటమి నేతలకు ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరాం. సభలో చర్చించమని కోరామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సభలో టీడీపీ మంత్రులు అవాకులు, చవాకులు మాట్లాడారు. టీడీపీ నేతలకు కావాల్సింది స్వామివారి ఔన్నత్యం పెంచడం కాదు. కూటమి నేతలకు కావాల్సింది రాజకీయం. మీకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా చర్చకు రండి. చెప్పులు, బూట్లు వేసుకుని మేం దేవుడి ఫోటోలను పట్టుకుని ఉన్నట్లు నిరూపించండి. కెమెరాలు ఉన్నాయిగా మీకు వీలైతే ఆధారాలు చూపించండి. టీడీపీ నేతల వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. సభలో మేం ప్రదర్శించిన పేపర్లను నేనే స్వయంగా కలెక్ట్ చేసి టేబుల్ మీద పెట్టా. చంద్రబాబు లాగా మేం వేంకటేశ్వరస్వామి ఫోటోలను బూట్లు వేసుకుని పట్టుకోలేదు. వాళ్లలాగా మాది నీచబుద్ధి కాదు. దేవుడిని అవమానించారని ఊగిపోయిన జనసేన, బీజేపీ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు? చంద్రబాబు బూట్లు వేసుకుని దేవుడి ఫోటోను పట్టుకున్నది మీకు కనిపించడం లేదా?. మేం దేవుడి ఫోటోలను సభలో చెప్పులతో పట్టుకున్నట్లు నిరూపించండి. దేవుడి ఫోటోలను చించి, విసిరేశారని మాట్లాడుతున్నారు. మేం ఫోటోలను చించినట్లు రుజువు చేయండి. దేవుడిని రాజకీయాల్లోకి లాగింది చంద్రబాబు, పవన్, కూటమి నేతలు. దేనికి సభలో మంత్రులు ఊగిపోతున్నారని మండిపడ్డారు.

## ఫిరాయింపు ఎమ్మెల్సీలకు నోటీసులు

**అమరావతి,ఫిబ్రవరి 20 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఫిరాయింపు ఎమ్మెల్సీలకు ఏపీ మండలి నుంచి నోటీసులు జారీ అయ్యాయి. ఫిరాయింపు ఎమ్మెల్సీలకు మండలి చైర్మన్ మోషేన్ రాజు నోటీసులు జారీ చేశారు. రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ నెల 25, 26న విచారణకు హాజరవ్వాలని నోటీసుల్లో స్పష్టం చేశారు. ప్రలోభాలకు లోనై ఫిరాయించారనే వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు నేపథ్యంలో విచారణకు రావాలని మండలి చైర్మన్ నోటీసులు జారీ చేశారు. బల్లి కల్యాణ చక్రవర్తి, జయ మంగళ వెంకట రమణ, మర్రి రాజశేఖర్, పద్మ శ్రీ, సునీతలకు నోటీసులు జారీ అయ్యాయి. వీరంతా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందినవారు, కానీ రాజీనామాలు చేసి టీడీపీలో చేరారు. దీనిపై మండలి చైర్మన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేయగా, వారికి తాజాగా నోటీసులు జారీ చేశారు.



## గోదావరి పుష్కరాలకు భారీగా ఏర్పాట్లు

### నది కాలుష్యం కాకుండా కాపాడుతాం

### అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

**అమరావతి, ఫిబ్రవరి 20:** ఏపీ అసెంబ్లీ సమావేశాలుఏడో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. గోదావరి పుష్కరాల సందర్భంగా నది కాలుష్యం జరగకుండా తీసుకునే చర్యలపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పుష్కరాల్లో నది పవిత్రతను కాపాడటం సహా కాలుష్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని అన్నారు. డ్రెయిన్లతో పాటు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల నదికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. భక్తుల రద్దీ పెరిగే అంచనాతో స్నాన ఘట్టాల సంఖ్యను పెంచామని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో నది కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనలను కూడా పాటిస్తామని తెలిపారు. గోదావరి నది పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొన్ని చోట్ల జంతు కళేబరాలు, పౌల్ట్రీ వ్యర్థాలను నీటి వనరుల్లో కలిపేస్తున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నిమ్మల రామానాయుడు అభిప్రాయపడ్డారు.

## తొందరేమీ లేదు.. అన్నింటికీ మూల్యం తప్పదు

### తన ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన అంబటి

**గుంటూరు,ఫిబ్రవరి 20 :** తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం చెల్లించుకునే సమయం వస్తుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పర్మిషన్ తీసుకునే నల్లపాడు వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాను. టీడీపీ నేతలు కర్రలు, రాడ్లు తీసుకుని నా కారు మీదకు వచ్చారు. టీడీపీ నేతలు కట్టిన ఫ్లెక్సీని చించలేదు. ఇది మంచి సాంప్రదాయం కాదని చెప్పా. గూండాలు 4 గంటల పాటు బీభత్సం సృష్టిస్తే పోలీసులు ఏం చేశారని అంటూ ఆయన ప్రశ్నించారు. పోలీసులు, గూండాలు ఏకమై దారుణంగా ఇంటిపై దాడి చేశారు. ఆ మాట అనడాన్ని నా అంతరాత్మ ఒప్పుకోలేదు.. నేను బాధపడ్డాను. టీడీపీ నేతలు తిడుతున్నారనే ఉద్దేశంతో మాట అన్నాను. బ్యాచ్‌లుగా బ్యాచ్‌లుగా నా ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో నా పిల్లలు, నా మనవళ్లు ఉన్నారు. పోలీసులు సాక్షిగానే నా ఇంటి మీద దాడి చేశారు. నాలుగు గంటల పాటు నా ఇంటి మీద కరాళ నృత్యం చేశారు. పోలీసులు రక్షణ కల్పించలేక పారిపోండి అన్నారు. ఇదిలావుంటే అక్రమ కేసులో అరెస్ట్ అయ్యి.. బుధవారం బెయిల్‌పై విడుదలైన అంబటి రాంబాబు తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, టీడీపీ రౌడీ మూకలు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసుల నిర్లిప్త వైఖరి, కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం వంటి అంశాలను వైఎస్ జగన్‌కు వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అధికార పార్టీకి ఒత్తాసు పలుకుతూ వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరును జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

## పబ్జీ ఆడే జగన్‌కు క్రికెట్ గురించి ఏం తెలుసు

### హోంమంత్రి అనిత ఘాటు వ్యాఖ్యలు



**అమరావతి,ఫిబ్రవరి20:** ఏపీ హోం మంత్రి అనిత అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'గణతంత్ర దినోత్సవం, స్వాతంత్య్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగరేయకుండా.. ప్యాలెస్‌లో పబ్జీ ఆడేవాళ్లకు క్రికెట్ మ్యాచ్ టీవీలో చూస్తే సరిపోతుందనే ఆలోచనలే వస్తాయి. భారత్ – పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అంటే ప్రతీ భారతీయుడు ఇండియా గెలవాలని కోరుకుంటాడు. టీమ్ ఇండియాను ప్రోత్సహించి, ఆ గెలుపులో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలనుకుంటారు. దేశ భక్తి, దేశం పట్ల గౌరవం ఉన్న ఎవరికైనా ఇది అర్థమవుతుంది. మంత్రి లోకేశ్ సొంత ఖర్చులతో మ్యాచ్ చూసేందుకు కొలంబో వెళ్లారు. దేశాన్నే కించపరిచే జగన్‌కు దేశభక్తి గురించి చెప్పినా అర్థం కాదు' అని అనిత మండిపడ్డారు. ఆ రోజు ప్రజలంతా టీమ్‌ఇండియా గెలుపు చూస్తే.. వైకాపా వాళ్లు మాత్రమే లోకేశ్ విషయంలో తప్పులు చూశారని విమర్శించారు. ప్రజలు మాత్రం లోకేశ్‌లో దేశభక్తిని చూశారని పేర్కొన్నారు.

## నూతనంగా ఎన్నికైన సర్పంచులు కు 2వదశ శిక్షణా.

**పెద్దపల్లి :** ఈ రోజు పెదపల్లి లోని మదర్ థెరెసా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు 2వ దశ శిక్షణా కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణా కార్యక్రమంలో అంతర్గాం, ధర్మారం, ఎలిగేడ్, జూలపల్లి, రామగిరి, మంథని మరియు ముత్తారం (వీఁ) మండలాల నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి శ్రీ వీర బుచ్చయ్య ముఖ్యఅతిథిగా హాజరైనారు. శిక్షకులుగా గా డీఎల్‌పీఓ పెదపల్లి శ్రీమతి దేవకి దేవి, డీఎల్‌పీఓ మంథని శ్రీ కొమురయ్య, ఏపీడీ శ్రీ సత్యనారాయణ, సంబంధిత మండల పంచాయతీ అధికారులు (ఫీూలు), ఎస్‌బీఎం శ్రీ రాఘవులు, ఈసీ శ్రీ అయూబ్ ఖాన్ మరియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని, పంచాయతీ పరిపాలనలో పారదర్శకత, బాధ్యతాయుతమైన నిర్వహణకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వము సమస్త సర్పంచులకు చట్టం పైన రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల పైన ఈ యొక్క శిక్షణ కార్యక్రమాన్ని 5 రోజులు ఏర్పాటు చేయడం జరిగింది. ఏడు మండలాల సర్పంచులు తప్పకుండా ఐదు రోజులు హాజరై ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరనైనది.

## ఆసక్తి గల యువతకు అగ్ని వీర్ పరీక్షల కోసం 90 రోజులో ఉచిత శిక్షణ..

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఫిబ్రవరి 23 లోపు ఆసక్తి గల యువత దరఖాస్తు చేసుకోవాలి



**పెద్దపల్లి, ఫిబ్రవరి 20( సమయం న్యూస్).:** జిల్లాలో ఆసక్తి గల యువతకు అగ్ని యూపిహెచ్‌ఎస్ పరీక్షల సన్నద్ధం అయ్యేందుకు వీలుగా 90 రోజుల పాటు శారీరక ,లిఖిత పరీక్షల కోసం ఉచిత శిక్షణ అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని యువతకు సైన్యంలో చేరే అర్హత సాధించేందుకు "అగ్నివీర్ యూపీహెచ్‌ఎస్ శిక్షణ పథకం --2026" కార్యక్రమ ద్వారా అగ్నివీర్ అభ్యర్థులకు పూర్తి స్థాయి శారీరక లిఖిత పరీక్షల శిక్షణ అందిస్తున్నామని, ఈ శిక్షణలో ఫిజికల్ ట్రైనింగ్, మెడికల్ పరీక్షల అవగాహన, రాత పరీక్ష కోచింగ్, గ్రౌండ్ ప్రాక్టీస్, యూనిఫామ్, స్టడీ మెటీరియల్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఆసక్తిగల యువత ఫిబ్రవరి 23 లోపు తమ పేర్లు ఉచిత శిక్షణ కోసం రిజిస్టర్ చేసుకోవాలని, ఫిబ్రవరి 25న దరఖాస్తు చేసుకున్న వారికి మెడికల్ పరీక్షల నిర్వహించి శిక్షణ కొరకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని ఒకటి నుంచి మే 31 వరకు శిక్షణ నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా 10వ తరగతి ఉత్తీర్ణత సాధించాలని వీరి వయస్సు 17.5 నుండి 22 మధ్యలో ఉండాలని అన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు భోజనం, శిక్షణ తరగతులు, గ్రౌండ్ ప్రాక్టీస్, స్టడీ మెటీరియల్ అందించబడుతుంది. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత తేదీలలో రుద్రమదేవి స్టేడియం, సెంటెనరీ కాలనీ, రామగిరి నందు ఉదయం 6:00 గంటల నుండి 8:00 గంటల వరకు హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు తమ వెంట ఆధార్ కార్డు, పదవ తరగతి మెమో, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలని మరిన్ని వివరాలకు 9573688952, 9949725997, 8106807784 నెంబర్లను సంప్రదించగలరని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో దారుణం.





సునీత (30)ను మాజీ భర్త మహేష్.. అతి కిరాతకంగా హత్య చేశాడు. పెట్రోల్, కత్తులు, కట్టర్లతో సునీత ఇంటికి వెళ్లిన మహేష్.. కత్తులతో దాడి చేసి, పూలకుండీతో తలపై బలంగా కొట్టాడు. సునీత చనిపోవటంతో.. తప్పించుకునేందుకు ప్రయత్నించగా..అప్పటికే అపార్ట్‌మెంట్‌వాసులు ఇచ్చిన సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మహేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై మహేష్ ఎందుకంత కోపం పెంచుకున్నాడన్న దానిపై రకరకాల కారణాలు వినిపిస్తున్నాయి.

## అమరావతిలో ఘనంగా ప్రారంభమైన ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్

**అమరావతి: ఫిబ్రవరి 20( సమయం న్యూస్)** మంగళగిరి 6వ బెటాలియన్‌ప్రాంగణాలో రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐజీపీ స్పోర్ట్స్ కే.వి. మోహన్ రావు, డీఐజీ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ కేకేఎన్ అనుబు రాజన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పోలీసు జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. సుమారు ఆరు రాష్ట్రాల నుంచి మొత్తం 10 జట్లు పోటీ పడుతున్నాయి. ప్రారంభ కార్యక్రమంలో హోం మంత్రి అనిత పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం టి20 టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ మ్యాచులు ఐదు రోజుల పాటు మూలపాడు గ్రౌండ్లో జరగనున్నాయి. ఈ సందర్భంగా హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, పోలీసులు అనునిత్యం ప్రజా భద్రత కోసం 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి క్రీడా కార్యక్రమాలు పోలీసుల్లో ఐక్యతను పెంపొందించడమే కాకుండా, శారీరక-మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనడం ముఖ్యం గాని గెలుపు మాత్రమే లక్ష్యం కాదని ఆమె స్పష్టం చేశారు. అమరావతి ప్రజల రాజధాని అని, దానిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని అన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో దోహదపడతాయని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనితను పోలీసులు ఘనంగా సత్కరించారు.

## భూపాలపల్లి జిల్లా కోర్టులో ACB తనిఖీలు




రూ.5 వేలు లంచం తీసుకుంటూ అధికారులకు పట్టుబడ్డ కోర్టు సిబ్బంది

స్టెనోగ్రాఫర్ సాయి చరణ్, సిబ్బంది పున్నం రజిత, కొమ్ము సునీతలను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులుఓ కేసుకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు ఇచ్చేందుకు లంచం డిమాండ్

## జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం

- నిర్వహించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్



**వికారాబాద్, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ముందుగా వివిధ పోలీస్ స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులు, ఇప్పటివరకు నమోదైన కేసుల పురోగతిపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా వేగవంతంగా విచారణ పూర్తి చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పోలీస్ అధికారి మరియు సిబ్బంది పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు,ఆస్తి నేరాలు వంటి అంశాలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రమాదాలను తగ్గించే దిశగా పని చేయాలన్నారు. అలాగే ప్రజలకు స్నేహపూర్వక పోలీసింగ్ అందించాలని, నేరస్తులపై మాత్రం చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మానవతా దృక్పథంతో పని చేస్తూ, ప్రజల విశ్వాసం పొందే విధంగా పోలీస్ వ్యవస్థ ముందుకు సాగాలని తెలిపారు. గ్రామ పంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికల సమయంలో పోలీస్ యంత్రాంగం ఎంతో సమర్థవంతంగా విధులు నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులను అభినందించారు. భవిష్యత్తులో కూడా అదే నిబద్ధత, క్రమశిక్షణతో టీమ్ వర్క్‌తో పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. చివరగా ప్రతి పోలీస్ అధికారి తన బాధ్యతను గుర్తించి, ప్రజల భద్రతే లక్ష్యంగా పని చేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ పడవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్,పరిగి డీఎస్పీ శ్రీనివాస్,డీ సీ ఆర్ బీ డీఎస్పీ జానయ్య, ఏ.ఆర్ డీఎస్పీ వీరేష్, సీఐ లు, ఆర్ ఐ లు, ఎస్సై లు, ఆర్ ఎస్సై లు సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నాలుగు రోడ్లకు శంకుస్థాపన

--ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి వేగవంతం
-- సర్పంచ్ గుణిగంటి కమలాకర్

**చిన్నగూడూరు ఫిబ్రవరి20( సమయం న్యూస్).:** చిన్నగూడూరు మండలంలోని గుండం రాజుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు శుభారంభం జరిగింది. సర్పంచ్‌ల ఫోరం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్, గుండం రాజుపల్లి సర్పంచ్ గుణిగంటి కమలాకర్ ఆధ్వర్యంలో రూ.20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న నాలుగు సీసీ రోడ్లకు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. సర్పంచ్‌గా ఎన్నికైన తక్కువ కాలంలోనే గ్రామ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన కమలాకర్ ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలనీల్లో రవాణా సౌకర్యం మెరుగుపడేలా రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం గ్రామస్తుల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా సర్పంచ్ గుణిగంటి కమలాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే గ్రామాలు, పల్లెల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి, సంబంధిత శాఖల మంత్రులు, ముఖ్యంగా స్థానిక ఎమ్మెల్యే రామచంద్రనాయక్ సహకారంతోనే గుండం రాజుపల్లి గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరై పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రభుత్వ సంకల్పం, ఎమ్మెల్యే డాక్టర్ రామచందర్ నాయక్ మార్గదర్శకత్వంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి కోసం ప్రతి రూపాయి సద్వినియోగం చేస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కమలాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శుక్రవారం సభ ద్వారా ప్రజారోగ్య పర్యవేక్షణ

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ ఫిబ్రవరి20( సమయం న్యూస్). :** శుక్రవారం సభల్లో అంగన్వాడి, వైద్య సిబ్బంది ద్వారా నివేదిక తెప్పించుకుని ప్రజారోగ్యాన్ని పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. చొప్పదండి మండలం చాకుంట అంగన్వాడి కేంద్రం ఆవరణలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ తల్లీపిల్లల ఆరోగ్యానికి, పోషణకు శుక్రవారం సభ ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. పిల్లల ఆరోగ్యం పై ఎలాంటి సందేహాలు ఉన్నా శుక్రవారం సభలో ప్రభుత్వ వైద్యునికి తెలియజేయాలన్నారు. ప్రతినెలా అంగన్వాడి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామాల వారీగా ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన నివేదిక తెప్పించుకొని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. బరువు తక్కువగా ఉన్న శిశువుల పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, అలాంటి పిల్లలను గుర్తించి వారి ఎదుగుదలకు చర్యలు తీసుకుం టున్నామని అన్నారు. అతిగా బరువు తక్కువ ఉన్న చిన్నారు లను ఎన్ఆర్సి లో చికిత్స అందించి సాధారణ బరువు పెరిగేలా చూస్తున్నామని తెలిపారు. శుక్రవారం సభలో 95 శాతం మంది మహిళలు ఆరోగ్య మహిళ వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారని, 245 మంది మహిళలకు రెండవ దఫా స్క్రీనింగ్ పూర్తయిందని, ఇది మంచి విషయమని అన్నారు. శుక్రవారం సభలో ఏర్పాటు చేసే హెల్త్ క్యాంపులను కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మహిళా సర్పంచులు శుక్రవారం సభ నిర్వాహణకు ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమని అన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు పరీక్షలు పూర్తయ్యేంతవరకు పిల్లలను కచ్చితంగా ప్రతిరోజు బడికి, ప్రత్యేక తరగతులకు పంపించాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు, శిశువులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్య అధికారి వెంకటరమణ, గ్రామ సర్పంచ్ పురం మాధవి, ఉపసర్పంచ్ వేముల శేఖర్, సిడిపిఓ నర్సింగారాణి తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీల ఆర్థికాభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్

- (TGMFC) ఆధ్వర్యంలో ఆర్థిక సహాయ పథకం (Economic Support Scheme)
- క్రింద రెండు ముఖ్యమైన పథకాలను 2025--26 ఆర్థిక సంవత్సరానికి అమలులోకి తీసుకువచ్చినట్లు
- జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి, నారాయణపేట - ఏం.ఎ. రషీద్ తెలిపారు.

**నారాయణపేట, ఫిబ్రవరి,20(సమయం న్యూస్)**



1) తుర్కా కాశా ముస్లిం వర్గానికి టూల్‌కిట్లు ఉ జనరేటర్ల పంపిణీ

రాళ్లు కత్తిరించే వృత్తిలో నిమగ్నమైన పేద టర్కా కాశా ముస్లిం వర్గానికి చెందిన లబ్ధిదారుల పునరావాసం, జీవనోపాధి మెరుగుదల లక్ష్యంగా ఈ పథకం అమలు చేయబడుతుంది.

ప్రతి లబ్ధిదారుడికి రూ.60,000/- చొప్పున, రూ.10,000/- విలువైన టూల్‌కిట్ మరియు రూ.50,000/- విలువైన జనరేటర్ ను 100% సబ్సిడితో ఒకేసారి అందించబడుతుంది.

2) మైనారిటీ యువతకు ఈ-స్కూటర్ల పంపిణీ (పైలట్ ప్రాజెక్ట్)

మైనారిటీ యువత (పురుషులు) ఆర్థికంగా బలోపేతం కావడానికి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ-స్కూటర్ల పంపిణీ పథకం అమలులో ఉంది. ఈ పథకంలో ఈ-స్కూటర్ యూనిట్ వ్యయం సుమారు రూ.1.50 లక్షలు కాగా, అందులో 80% సబ్సిడీ (రూ.1.20 లక్షలు) ప్రభుత్వం అందిస్తుంది. మిగిలిన 20% (రూ.30,000/-) లబ్ధిదారుడి వాటాగా ఉంటుంది. ఎంపికైన లబ్ధిదారులను ఉబర్ / రాపిడో / ఓలా వంటి సేవా సంస్థలతో అనుసంధానం చేయడం ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించబడతాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుల వివరాలు

ఈ రెండు పథకాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు

తేది: 20-02-2026 ఉదయం 10:30 గంటల నుండి తేది: 01-03-2026 రాత్రి 11:59 గంటల వరకు

TGOBMMS వెబ్‌సైట్ : http://tsobmms.cgg.gov.in లో స్వీకరించబడతాయి.

టూల్‌కిట్లు & జనరేటర్లఈ-స్కూటర్లతుర్కా కాశా ముస్లిం కమ్యూనిటీ సర్టిఫికేట్

మైనారిటీ కమ్యూనిటీ సర్టిఫికేట్. ఆధార్ కార్డు మరియు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు)లను చిరునామా ఆధారంగా తప్పనిసరిగా సమర్పించాలి. ఆధార్ కార్డు మరియు ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు)లను చిరునామా ఆధారంగా తప్పనిసరిగా సమర్పించాలి. దరఖాస్తుదారుని వయస్సు 21 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల మధ్యలో ఉండాలిదరఖాస్తుదారుని వయస్సు 21 సంవత్సరాల నుండి 40 సంవత్సరాల మధ్యలో ఉండాలి. గత 5 సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (౧+వీఖీజ) ద్వారా ఎలాంటి ఆర్థిక సహాయం పొందకుండా ఉండాలిదరఖాస్తుదారు కనీస విద్యార్హతగా 10వ తరగతి ఉత్తీర్ణుడై ఉండాలి, దరఖాస్తుదారుని డ్రైవింగ్ లైసెన్సు (వతీశీ ఝుంవం), ౹ూచీ ఝుతీఽ మరియు గత 5 సంవత్సరాలలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (౧+వీఖీజ) ద్వారా ఎలాంటి ఆర్థిక సహాయం పొందకుండా ఉండాలిఈ అవకాశాన్ని సిద్దిపేట జిల్లాలోని అర్హులైన తుర్కా కాశా ముస్లిం మరియు మైనారిటీ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారిణి శ్రీ ఏం.ఎ. రషీద్ విజ్ఞప్తి చేయడం జరిగినది. జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి నారాయణపేట జిల్లా



## సైన్స్ మ్యూజియం పునరుద్ధరణ పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్

**కరీంనగర్ ఫిబ్రవరి20( సమయం న్యూస్).:** జిల్లా కేంద్రంలోని పురాతన పాఠశాల పరిధిలోగల జిల్లా సైన్స్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ మ్యూజియంలో పునరుద్ధరణ పనులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్న గదులను పరిశీలించారు. విద్యార్థులు తయారుచేసిన ఆర్ట్ క్రాఫ్ట్ ప్రదర్శన గురించి పలు సూచనలు ఇచ్చారు. బిర్లా ప్లాంటోరియం నుండి సప్లై చేయబడిన ఇన్ఫినిటీ వెల్ , డిఎన్ఏ మోడల్, బయాలజికల్ మోడల్స్, గ్లోబ్ మోడల్, మ్యాగ్నెటిక్ లైన్స్, వరల్డ్ క్లాక్, సోలార్ పవర్ వంటి ఎగ్జిబిట్ లను పరిశీలించారు. మ్యూజియంలో ఏర్పాటు చేయబోయే ప్రతి ఎగ్జిబిట్ గురించిన పూర్తి సమాచారం ప్రదర్శించాలని అన్నారు. విద్యార్థులు మ్యూజియం ని సందర్శించి విషయ పరిజ్ఞానాన్ని నేర్చుకుని వెళ్లేలా తీర్చిదిద్దాలని సూచించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేసి మ్యూజియంను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని సైన్స్ అధికారులను ఆదేశించారు. జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి, విద్యాశాఖ కోఆర్డినేటర్ మిల్కూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లాలోని పుల్కల్ మండలం బస్వాపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్" పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. పనులను వేగవంతంగా, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.

# రెసిడెన్షియల్ స్కూల్స్, భవిత కేంద్రాల నిర్వహణ మరింతగా మెరుగుపడాలి

● మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష



**నిజామాబాద్, ఫిబ్రవరి 20( సమయం న్యూస్).** ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, భవిత కేంద్రాల నిర్వహణ తీరుతెన్నులపై కలెక్టర్ ఇలా త్రిపాఠి మండల ప్రత్యేక అధికారులతో శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో సుదీర్ఘ సమీక్ష జరిపారు. ఒక్కో మండలం వారీగా స్పెషల్ ఆఫీసర్లు జరిపిన క్షేత్రస్థాయి సందర్శనలు, ఆయా పాఠశాలల్లో వారు గమనించిన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా స్కూళ్ళలో నెలకొని ఉన్న స్థితిగతులు, పెండింగ్ పనులు, ఎం.ఎస్.ఓ లు సందర్శించిన దృశ్యాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి పరిశీలనలు కొనసాగించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎస్ఓ లకు ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న భవిత కేంద్రాల నిర్వహణ మరింతగా మెరుగుపడాలని, వివిధ దశలలో నిర్మాణాలలో ఉన్న కేంద్రాల పనులను వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. మంజూరీలు తెలుపబడిన అన్ని పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులకు గడువు విధించారు. రెసిడెన్షియల్ స్కూల్స్, వసతి గృహాలు, పాఠశాలల్లో విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అన్నది పరిశీలించాలని, మెనూ పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. కలుషిత ఆహారం వంటివి చోటుచేసుకోకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేజీబీవీలు సహా అన్ని బాలికల విద్యాలయాల్లో సీ.సీ టీ.వీలు వర్కింగ్ కండీషన్ లో ఉండాలని, అవసరమైన చోట వెంటనే మరమ్మతులు చేయించాలని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, భద్రతకు ఎనలేని ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. సమావేశంలో డీఆర్డీఓ సాయాగౌడ్, డీఈఓ అశోక్, ఆర్.సీ.ఓలు, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# ఎస్ ఎస్ సి లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

---జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ఫిబ్రవరి20( సమయం న్యూస్).:** పదవ తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ విద్యార్థులకు సూచించారు.కోల్చారం మండలం పోతానశెట్టిపల్లి గ్రామంలోనీ జడ్పీ హైస్కూల్లో నిర్వహిస్తున్న పదవ తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలించారు.విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు.సబ్జెక్టులను ఏ విధంగా చదవాలి ,మంచి మార్కులు ఎలా స్కోర్ చేయాలో మెళకువలు చెప్పారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలో శత శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు బట్టి పద్ధతికి స్వస్తి పలికి,విషయ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. తూచా తప్పకుండా ప్రత్యేక తరగతులకు హాజరు కావాలన్నారు. విద్యార్థులు టీవీ, ఫోను ,సోషల్ మీడియాలకు దూరంగా ఉండాలన్నారు. ఇష్టం తో చదివి ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# పి ఎం విశ్వకర్మ లబ్ధిదారులకు మార్కెటింగ్ అవగాహన.

● మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పి.వి.ఆర్ బ్యాంకెట్ హాల్ మెట్టుగూడ లో

● పీఎం విశ్వకర్మ లబ్ధిదారులకు మార్కెటింగ్ అవగాహన కార్యక్రమం

**మహబూబ్ నగర్ ఫిబ్రవరి20( సమయం న్యూస్).:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మీవీజు-ఐఖీూ (హైదరాబాద్) సమన్వయంతో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారుల కోసం "మార్కెటింగ్ విధానాలపై" ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ మార్కెటింగ్, ఫైనాన్షియల్ లిటరసీ (ఆర్థిక అక్షరాస్యత), ఈ-కామర్స్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ డెవలప్‌మెంట్ (ఉద్యమశీలత అభివృద్ధి) వంటి కీలక అంశాలపై లబ్ధిదారులకు సమగ్ర అవగాహన కల్పించారు.

**ముఖ్య అతిథులు మరియు పాల్గొన్నవారు:**ఈ కార్యక్రమంలో మీవీజు-ఐఖీూ హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ నవీన్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం యాదయ్య, డి.ఐ.సి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, IPPB సీనియర్ మేనేజర్ సజ్జన్ గన్నరపు, జేఎస్ఎస్ (జీూా) డైరెక్టర్ ఎన్. సుబ్బారెడ్డి, నిమ్స్మే (అఱ-ఎంఎవ) ఈడీసీ మేనేజర్ మహబూబ్ అలీ, మరియు ఈడీసీ అసిస్టెంట్ మేనేజర్ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కార్యక్రమ ముఖ్యాంశాలు:**ఈ సందర్భంగా 50 మంది లబ్ధిదారులకుూ= కోడ్ ఆన్‌బోర్డింగ్ ప్రక్రియను పూర్తి చేశారు.

ఇది డిజిటల్ చెల్లింపులను (ఖూ× మరియు ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ - సులభతరం చేసి, వారి వ్యాపారాలను ఆధునికీకరించడానికి దోహదపడుతుంది.ఈ అవగాహన కార్యక్రమంలో మొత్తం 80 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

# కమిషనర్ ఆదేశాల మేరకు దోమల నివారణకు చర్యలు

● సరూర్నగర్ చెరువులో గంబూసియా చేపల విడుదల.



**హైదరాబాద్, ఫిబ్రవరి 20(సమయం న్యూస్ ) :** దోమల నివారణకు సరూర్నగర్ చెరువులో సరూర్నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, ఎంటమాలజి విభాగం సీనియర్ ఎంటమాలాజిస్టు మాధవరెడ్డి వారి సిబ్బందితో కలిసి 25,000 గంబూసియా చేపలను విడుదల చేశారు. చెరువులు,కుంటలలో గంబూసియా చేపల విడుదల అనేది దోమల నివారణకు ఒక మంచి జీవశాస్త్ర పద్ధతి అని తెలిపారు. ఒక గంబూసియా చేప రోజుకు 100 నుండి 150 దోమల లార్వాను తినేస్తుంది అని తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతితో రాబోయే రోజులలో దోమల బెడద ఎక్కువగా ఉండే అన్ని కుంటలు చెరువులలో గంబూసియా చేపల విడుదలకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నాము అని తెలిపారు.



# 10వ తరగతి పరీక్షల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్ సమీక్ష

**నారాయణపేట, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీలు మోడల్ స్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో 10వ తరగతి పరీక్షల సన్నద్ధతపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఐఏఎస్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) శ్రీ గోవిందరాజు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశంలో వివిధ పాఠశాలల పనితీరును వివరంగా సమీక్షించారు.పదవ తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న టాప్ 10 పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ప్రధానోపాధ్యాయుడు తమ సబ్జెక్టు ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల పరీక్ష ఫలితాలు, ఉపాధ్యాయుల పనితీరుపై నిరంతర సమీక్షలు నిర్వహించాలని ఆమె సూచించారు.విద్యార్థులు ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు సాధిస్తున్నారో గుర్తించి,ఆ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. పనితీరు బాగా లేని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయులతో వెంటనే సమావేశాలు నిర్వహించాలని డీఈఓని ఆదేశించారు.కఠినమైన గణితం, భౌతిక శాస్త్రం వంటి సబ్జెక్టుల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చి, వారు మంచి మార్కులతో పాస్ అయ్యేలా వివరణాత్మక ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. త్వరలోనే (26.02.2026 న) నిర్వహించనున్న ప్రీ-ఫైనల్ పరీక్షల ఫలితాల సమావేశంలో మెరుగైన పనితీరు కనబరచాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేని పక్షంలో వారిపై చర్యలు తీసుకోవాలని డీఈఓకి సూచించారు.అన్ని ప్రధానోపాధ్యాయులు ప్రీమియర్ స్కాలర్‌షిప్‌లలో విద్యార్థుల రిజిస్ట్రేషన్‌ను సోమవారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.అన్ని మండల కేంద్రాల్లో 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు నిర్వహించాలని ఎంఈఓలకు సూచించారు.డీసీఈబీ సెక్రటరీ రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ... పదవ తరగతి వార్షిక పరీక్షల మధ్యలో ఉన్న నాలుగు రోజుల వ్యవధిని విద్యార్థులు కీలకంగా వినియోగించుకోవాలని వివరించారు.ఈ సమీక్ష సమావేశం ద్వారా జిల్లాలో 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కీలక చర్యలు చేపట్టాలనే జిల్లా అధికారులకు సూచించడం జరిగింది.ఈ సమావేశంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్ పై కమిషనర్ సమీక్ష

● టౌన్ ప్లానింగ్ విభాగంతో కమిషనర్ గారు టెలి కాన్ఫరెన్స్

● బిల్డ్ నౌ లో పెండింగ్ ఫైల్లపై సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి 20(సమయం న్యూస్) :** ఎం.ఎం.సి కమిషనర్ టి.వినయ్ క్రిష్ణారెడ్డి రెడ్డి, ఐ.ఏ.ఎస్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ తో కలిసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సిటీ ప్లానర్ లు మరియు అసిస్టెంట్ సిటీ ప్లానర్ లతో జోనల్ మరియు సర్కిల్ వారిగా బిల్డ్ నౌ లో పెండింగ్ ఉన్న ఫైల్స్ పై సమీక్షించారు.ఎస్ ఎల్ ఏ గడువు ముగిసిన తర్వాత కూడా ఫైల్స్ పెండింగ్ ఉన్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఎస్ ఎల్ ఏ గడువు లోపలనే ఫైల్స్ అన్నింటిని క్లియర్ చేయాలని ఆదేశించారు. క్రింది స్థాయి ఉద్యోగి వద్ద ఫైల్స్ పెండింగ్ లేకుండా కూడా చూడటం పై స్థాయి అధికారుల బాధ్యత అని తెలియజేశారు.

# బ్యాడ్మింటన్‌లో వరంగల్ ఏసీపీల జోడీకి స్వర్ణం!



సైబరాబాద్ కమిషనరేట్ వేదికగా జరుగుతున్న 4వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో వరంగల్ అధికారులు సత్తా చాటారు. 55 ఏళ్ల గెజిటెడ్ అధికారుల బ్యాడ్మింటన్ విభాగంలో వరంగల్ కమిషనరేట్‌కు చెందిన ఏసీపీలు జితేందర్ రెడ్డి, మధుసూదన్ జోడీ అద్భుత ప్రదర్శనతో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. కోర్టులో పదునైన ఆటతీరుతో ప్రత్యర్థులను చిత్తు చేసి ప్రథమ స్థానంలో నిలిచారు.

# " మోతాజుఖానా పట్టణ ఆరోగ్య కేంద్రంలో అడల్ట్ వ్యాక్సినేషన్

- ఆరోగ్య సంరక్షకుల కోసం హెపటైటిస్-బి వాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభం'.



**కరీంనగర్ ఫిబ్రవరి20( సమయ్దం న్యూస్) :**ఈరోజు ఉదయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ గారు ప్రోగ్రాం అధికారులతో కలిసి మోతాజుఖానా పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సంరక్షకుల కోసం అడల్ట్ వ్యాక్సినేషన్ - హెపటైటిస్-బి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెపటైటిస్-బి వ్యాధి నుండి ఆరోగ్య సంరక్షకులను రక్షించడం, ఈ వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త కోసం మరియు వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడం కోసం ఈ అడల్ట్ వాక్సినేషన్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో జరుగుతుందన్నారు. ఈ అడల్ట్ వాక్సినేషన్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సాజిద,జిల్లా ఉప వైద్య అధికారి డాక్టర్ రాజగోపాల్ రావు, పిఓ డిటిటి డాక్టర్ ఉమాశ్రీ, పిఓ ఎంహెచ్ఎన్ డాక్టర్ సన జవేరియా మరియు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఇమ్రాన్, సూపర్వైజర్ బేగ్, మరియు సిబ్బంది పాల్గొన్నారు. Sd/-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కరీంనగర్

దీని ప్రతి అందరూ పత్రికా ప్రతినిధులకు ప్రచురణ నిమిత్తము శ్రీయుత జిల్లా పౌర సంబంధాల అధికారి ద్వారా పంపనైనది.

### కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై మాట్లాడుతున్న...

# యుటిఎఫ్ మండల అధ్యక్షులు గౌరరాం గోపాల్

**బొంరస్ పెట మండలం,ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** బొంరస్ పేట మండల కేంద్రం లోని పి ఎం శ్రీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన మొదటి రోజు కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ మండల అధ్యక్షులు గౌరారం గోపాల్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగింపు దశలో ఉన్నందువలన పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వహకుల పెండింగ్ బకాయిలను సంబంధిత శాఖల అధికారులతో చర్చించి వీలైనంత త్వరలోనే బకాయలు చెల్లించే ప్రయత్నం చేయాలని కోరారు. గత అకాడమిక్ ఇయర్ 2024- 25 ఎంపీ ఎలక్షన్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల వారి అటెండెన్స్ ప్రకారం అర్హతలు ఉన్న వారందరికీ సంపాదిత సెలవులు ఈయల్స్ ఉత్తర్వులు మంజూరు చేయాలని కోరారు 2025-26 సంవత్సరంలో నిర్వహించిన స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికలలో శని ఆదివారాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ జిల్లా అధికారులను సంప్రదించి సిసిఎల్స్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

# నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ లపై కఠిన చర్యలు

● కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, ఫిబ్రవరి 20( సమయం న్యూస్).** నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన ఐడీఓసీలో గర్భస్తపూర్వ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశము జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ అన్ని ప్రమాణాలు పాటిస్తూ అర్హతలు ఉన్న స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలన్నారు. జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలన్నీ రికార్డులను, రిపోర్టులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని, లేనిచో వారికి రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయకూడదని అన్నారు. పిసిపిఎన్డిటి చట్టంపై విస్తృతంగా అవగాహన సదస్సులను నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, పీ.ఓ లు సుప్రియ, శిఖర, డిప్యూటీ డీఎంహెచ్ఓలు అశ్వినీ, సమత, రెడ్ క్రాస్ ప్రతినిధి బుస్స ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ సమీక్ష

**హైదరాబాద్,ఫిబ్రవరి 20(సమయం న్యూస్) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్ హయత్ నగర్ సర్కిల్ పరిధిలోని వివిధ వార్డులలో పర్యటించి శానిటేషన్, అభివృద్ధి పనులు మరియు ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్ష నిర్వహించారు. మునగనూరు రోడ్, వెంకటేశ్వర కాలనీ మరియు సాహెబ్ నగర్ జోడు బావి ప్రాంతాల్లో ఉన్న జీవిపిలను పరిశీలించారు.స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో చెత్త సేకరణ మరియు తరలింపు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. కుమ్మరి కుంట చెరువు పరిసర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోవడాన్ని గమనించారు. చెత్త తొలగింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. చెరువు పరిరక్షణ మరియు శుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు పరిసరాల్లో ఉన్న గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, భవిష్యత్తులో మళ్లీ పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మునగనూరు రోడ్ వద్ద ఏర్పాటు చేయబోయే సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్ స్థలాన్ని పరిశీలించారు.మునగనూరు రోడ్‌లో స్టార్మ్ వాటర్ డ్రైన్ మరియు కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ సమీపంలో నిర్మించబోయే నూతన హయత్ నగర్ సర్కిల్ కార్యాలయ భవన స్థలాన్ని పరిశీలించారు. సచివాలయ నగర్‌లో కొనసాగుతున్న థీమ్ పార్క్ పనులను సందర్శించి, పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ప్రస్తుత డిమాండ్, బకాయిలు మరియు వసూళ్ల శాతంపై వివరాలు తెలుసుకున్నారు. బకాయి పన్నుదారులపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి వసూళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు.ప్రతి వార్డు వారీగా లక్ష్యాలను నిర్దేశించి, దినసరి సమీక్ష ద్వారా వసూళ్లను మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి. వంశీకృష్ణ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ (హెల్త్) డా. సూరజ్ కిరణ్ గౌడ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (హెచ్‌పీ) నీలిమ, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు దినేష్ సింగ్, వెంకన్న, నర్సింగరావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీళ్లపై దృష్టి పెట్టాలి



**రాయపోల్, ఫిబ్రవరి 20:**త్యాగాలతో నిర్మించిన ప్రాజెక్టుల నుంచి రైతులకు నీళ్లు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రాజెక్టుల కోసం పోరాడి సాధించిన నీటిని విడుదల చేయాలంటే కూడా ఆంక్షలు విధించడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. శుక్రవారంసిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలం మంతూర్--అనాజీపూర్ శివారులోని 13డి (రామాయంపేట) కాలువలో గోదావరి జలాలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో సాగు నీరు అందించే కాలువ నుంచి నీళ్లు విడుదల చేయడానికి ముందే అధికారులు రాజకీయ ఒత్తిడులతో కార్యక్రమాన్ని అడ్డుకున్నారని ఆరోపించారు.కలెక్టర్ కార్యాలయం,ఏసీపీ, నీటి పారుదల శాఖ అధికారులు ఫోన్‌ల ద్వారా ఒత్తిడి తెచ్చి చివరకు వారే నీళ్లు విడుదల చేశారని తెలిపారు.గత ప్రభుత్వంలో ప్రాజెక్టులు,ప్రధాన కాలువలు నిర్మిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం కాలువలలో పూడిక కూడా తీయడం లేదని విమర్శించారు.నీళ్లు వస్తాయని ఆశతో రైతులు పంటలు వేసుకుంటే,కాలువలు మురికితో నిండిపోవడంతో రైతులే తమ ఖర్చుతో పూడిక తొలగించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.సిద్ధిపేట జిల్లాలో సాగునీటి సమస్యలపై రెండున్నర ఏళ్లుగా సమీక్ష కూడా నిర్వహించలేదని,భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి "ఉత్త మంత్రిగా" మిగిలిపోయారని విమర్శించారు. ఉపకాలువల నిర్మాణంపై అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు.దుబ్బాక నియోజకవర్గం పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడిందని,ప్రతి ఎకరాకు సాగునీరు అందించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఉపకాలువల నిర్మాణానికి భూసేకరణ, పరిహారం, పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ హయాంలో ఆమోదం పొందిన ఇర్కోడు ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.111 కోట్లు మంజూరు అయినప్పటికీ, పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు.ఉపకాలువలు పూర్తిచేసి రైతులకు నీరు అందించకపోతే, తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మంతూర్ సర్పంచ్ పర్వేజ్, అనాజీపూర్ సోమని నిర్మల ఇస్తారి, గాజులపల్లి సర్పంచ్ పంజా స్వామి, ఇరిగేషన్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సమానత్వమే లక్ష్యం.. సామాజిక న్యాయమే మార్గం

- ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవ సదస్సు




**కరీంనగర్ ఫిబ్రవరి20( సమయం న్యూస్)కరీంనగర్, ఫిబ్రవరి 20:**సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగి ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, అవకాశాలతోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని కరీంనగర్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. 'ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం' సందర్భంగా జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. రాణి ఆదేశాల మేరకు ముగ్దుంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు, న్యాయవాది ఏ. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగం, పేదరికం, లింగ వివక్ష మరియు మానవ హక్కుల ఉల్లంఘనలను అరికట్టడమే ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశమని వివరించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సభ్యులు న్యాయవాదులు, పానెల్ అడ్వకేట్ లు పెరుక రంగయ్య పటేల్, చిట్టి చంద్ర ప్రకాష్ రెడ్డి, రాచకొండ దేవేందర్ లు హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అందరికీ న్యాయం అందాలనే రాజ్యాంగ ఆశయాలను గౌరవించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సామాజిక న్యాయంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మిక వ్యవస్థ రద్దు మరియు చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అడ్డుకోవడానికి చట్టం ఒక రక్షణ కవచంలా పనిచేస్తుందని స్పష్టం చేశారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో పేదరికం అడ్డుగోడ కాకూడదని అణగారిన వర్గాలకు అండగా నిలిచేందుకు న్యాయ సేవా అధికార సంస్థ నిరంతరం కృషి చేస్తుందని వారు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని వారు న్యాయం కోసం ఇబ్బంది పడకుండా సంస్థ అందిస్తున్న ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పెందోట జ్యోతి, డి. ప్రకాష్, పి. పద్మ, శ్రీనివాస్, నాగభూషణం సిహెచ్. ప్రభాకర్ పాల్గొన్నారు.సామాజిక న్యాయంపై విద్యార్థులు అడిగిన పలు సందేహాలను న్యాయ నిపుణులు నివృత్తి చేశారు

## నేడు వికారాబాద్ కు రానున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

**వికారాబాద్, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** రాష్ట్ర ముఖ్య మంత్రి వికారాబాద్ జిల్లా అనంతగిరి హరిత రిసార్ట్స్ లో ఏఐసీసీ శిక్షణ తరగతులు లో ప్రారంభోత్సవానికి రానున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, అదనపు కలెక్టర్ సుధీర్ ఎల్.బి (రా.దీ) అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ఇంటెలిజెంట్ సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీ చటర్జీ, కృష్ణ ,డీఎస్పీ తో కలిసి ఏర్పాట్ల ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్.శనివారం రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వస్తున్న సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా, రెండు అంబులెన్సులు, వైద్య సౌకర్యాలు,ముందు జాగ్రత్త గా ఫైర్ ఇంజన్ ను ఏర్పాటు చేయాలనీ సంబంధిత అధికారులకు సూచించారు.తేదీ 21-02-2026(శనివారం) రాష్ట్ర ముఖ్య మంత్రి రానున్న నేపథ్యంలో ముందుగా ఎస్ఎఫ్ఐ కాలేజ్ గ్రౌండ్లో హెలి ప్యాడ్ ఏర్పాట్ల ను పరిశీలించారు. కలెక్టర్ తోఆర్డిఓ వాసు చంద్ర, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్ మున్సిపల్ కమిషనర్ విక్రం నరసింహారెడ్డి ఆర్ఎంబి అధికారి శ్రీధర్ వికారాబాద్ ఎమ్మార్వో లక్ష్మీనారాయణ, ఆర్టీవో వెంకటరెడ్డి,డి ఎం హెచ్ ఓ స్వర్ణ కుమారి, ఎలక్ట్రిసిటీ డీఇ రవి ప్రసాద్,ఎక్సైస్ సూపరిండెంట్, విజయ భాస్కర్, పిసిసి అధ్యక్షుడు ధారాసింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్, ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బడ్జెట్‌లో బీసీలకు మొండిచేయి

- 27న ధర్నా చౌక్ లో 'బీసీల నిరాహారదీక్ష.
- ప్రభుత్వం బీసీలకు బడ్జెట్లో అన్యాయం చేస్తే సహించం
- ప్రభుత్వం వైఖరికి నిరసనగా రంగంలోకి బీసీ సంఘాలు
- జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్...



**హైదరాబాద్, ఫిబ్రవరి 20(సమయం న్యూస్) :** తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 3.05 లక్షల కోట్ల బడ్జెట్‌లో రాష్ట్ర జనాభాలో 61 శాతానికి పైగా ఉన్న బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని బీసీ సంఘాల నేతలు మండిపడ్డారు. ఈ వివక్షకు నిరసనగా ఫిబ్రవరి 27న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద భారీ నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. బీసీ ఇంటిలెక్చువల్ ఫోరం చైర్మన్, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్ శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బడ్జెట్ గణాంకాలను విశ్లేషించి ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

**బడ్జెట్ అంకెల గారడీ – బీసీల వాటా ఎంత?**

బీసీ నేతలు ప్రభుత్వం ముందుంచిన ప్రధాన గణాంకాలు మరియు విమర్శలు ఇలా ఉన్నాయి

నిధుల మళ్లింపు: 21 బీసీ కార్పొరేషన్లకు కేటాయించిన రూ. 4,400 కోట్లలో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని వారు ఆరోపించారు.

**కేటాయింపులు జం ఖర్చు:** ఏటా 20 వేల కోట్లు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, రెండేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ. 2,060 కోట్లు మాత్రమేనని పేర్కొన్నారు.

**వివక్షా పూరిత గణాంకాలు:** రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి 29 లక్షల కోట్ల బడ్జెట్ వ్యయం కాగా, అందులో బీసీలకు కేటాయించిన నిధుల్లో ఖర్చు చేసింది కేవలం 0.80 శాతం మాత్రమేనని వివరించారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్:** కాంట్రాక్టర్లకు రూ. 70 వేల కోట్లు చెల్లిస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల చదువుల కోసం అవసరమైన రూ. 10 వేల కోట్ల ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**సబ్ ప్లాన్ అమలు: ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో కూడా బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి రూ. 50 వేల కోట్లు కేటాయించాలి.

**స్కాలర్‌షిప్‌ల విడుదల:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే చెల్లించాలి.

**కార్పొరేషన్ల బలోపేతం:** 21 బీసీ కార్పొరేషన్లకు కేటాయించిన నిధులను ఇతర పథకాలకు మళ్లించకుండా ఆయా కులవృత్తుల అభివృద్ధికి వెచ్చించాలి.

**దీక్షకు తరలిరావాలని పిలుపు :**బీసీల రక్తమాంసాలతో తయారైన బడ్జెట్‌లో వారికే వాటా లేకపోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని బాలరాజ్ గౌడ్ ధ్వజమెత్తారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహుజన నాయకుడనని చెప్పుకుంటున్నారు కానీ, చేతల్లో మాత్రం ఒకే సామాజిక వర్గానికి పెద్దపీట వేస్తున్నారు" అని విమర్శించారు. ఫిబ్రవరి 27న జరిగే ఈ నిరసన దీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ మేధావులు, విద్యార్థులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్ ఛైర్మన్ దుర్గయ్య గౌడ్, రాష్ట్ర కన్వీనర్లు అయిలి వెంకన్న గౌడ్, బైరు శేఖర్ గంపుత్ర, ఎలికట్టె విజయ్ కుమార్, అంబాల నారాయణ, సింగం నాగేష్ గౌడ్, ఎర్రమాద వెంకన్న నేత, నాగభూషణం, బోయ గోపి, కర్నాటి మనోహర్, లింగేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ మోజు -- మత్తు బానిసత్వం.

# యువత భవిష్యత్తు ఎటు?

నేటి కాలంలో విద్యార్థులు, యువతి యువకులు మొబైల్ ఫోన్లకు,గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతూ తమ అమూల్యమైన సమయాన్ని వృథా చేసుకుంటున్న ఆందోళనకర పరిస్థితులు కనిపిస్తున్నాయి.చదువు,లక్ష్యం, భవిష్యత్తు అన్న భావనల కంటే వినోదం,వ్యసనాల వైపు మళ్లిపోతున్న యువత జీవితం క్రమంగా ప్రమాదంలో పడుతోంది.

**మొబైల్ -- మిత్రమా? శత్రువా?**

మొబైల్ ఫోన్ ఒక శక్తివంతమైన సాధనం.దాన్ని ఎలా ఉపయోగిస్తామన్నదే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది. కొందరు యువత దాన్ని చదువుకు,జ్ఞానానికి వినియోగిస్తుండగా,చాలా మంది మాత్రం వినోదానికి,సమయం వృథా చేసుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నారు.గంటల కొద్దీ సోషల్ మీడియా,గేమ్స్‌లో గడిపే అలవాటు వారి దృష్టిని,లక్ష్యాన్ని దూరం చేస్తోంది.

**పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల నిర్లక్ష్యం**

యువత తప్పుదారి పట్టడంలో తల్లిదండ్రుల పాత్ర కూడా కీలకంగా మారుతోంది. చిన్నప్పటి నుంచే పిల్లల చేతిలో మొబైల్ ఫోన్లు పెట్టడం,వారితో సమయం గడపకపోవడం,వారి అలవాట్లను గమనించకపోవడం వల్ల వారు చెడు మార్గాల వైపు వెళ్లే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.పుట్టిన బిడ్డకు కూడా మొబైల్ చూపిస్తూ ఆహారం తినిపించడం, ఏడుపు ఆపేందుకు ఫోన్ ఇవ్వడం వంటి అలవాట్లు పిల్లల మానసిక వికాసాన్ని దెబ్బతీస్తున్నాయి.ఇది తల్లిదండ్రులే తెలియక చేస్తున్న పెద్ద తప్పుగా నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**విదేశాల్లో నియంత్రణలు... మనలో నిర్లక్ష్యం**

కొన్ని దేశాల్లో పిల్లలకు 15 సంవత్సరాలు నిండే వరకు మొబైల్ ఫోన్ల వినియోగంపై కఠిన నియంత్రణలు అమల్లో ఉన్నాయి. వారి మానసిక, శారీరక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారు. కానీ మన సమాజంలో మాత్రం చిన్న వయస్సులోనే మొబైల్ అలవాటు పెంచడం వల్ల పిల్లలు చదువుపై ఆసక్తి కోల్పోతున్నారు.




**మత్తు పదార్థాలు -- మౌన విపత్తు**

గంజాయి వంటి మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నాయి.ఈ వ్యసనాలు ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను,సమాజాన్ని కూడా దెబ్బతీస్తున్నాయి.ఒకసారి అలవాటు అయితే బయటపడటం కష్టమవుతుంది. కాబట్టి ముందుగానే జాగ్రత్త అవసరం.

**లక్ష్యం ఉంటేనే విజయం సాధ్యం**

ప్రతి విద్యార్థి తన జీవితానికి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ధారించుకోవాలి.మొబైల్ ఫోన్‌ను వినోదానికి మాత్రమే కాకుండా చదువుకు,నైపుణ్యాల అభివృద్ధికి ఉపయోగించాలి. క్రమశిక్షణతో కృషి చేస్తేనే విజయం సాధ్యం.

**ఉద్యోగం కోసం కాదు... ఉపాధి కల్పించే దిశగా**

యువత ఉద్యోగాల కోసం మాత్రమే కాకుండా,వ్యాపార అవకాశాలను సృష్టించే దిశగా ఆలోచించాలి.తమ ప్రతిభతో కొత్త అవకాశాలను సృష్టించి, మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి.

**తల్లిదండ్రులు -- గురువుల బాధ్యత**

పిల్లలపై తల్లిదండ్రులు, గురువులు నిరంతరం పర్యవేక్షణ చేయాలి.వారి స్నేహితులు, అలవాట్లు,రోజువారీ పనులపై దృష్టి పెట్టాలి.ప్రేమతో పాటు నియంత్రణ కూడా అవసరం. మంచి విలువలు నేర్పితేనే పిల్లలు మంచి పౌరులుగా ఎదుగుతారు.

**మారాలి... మార్పు మన నుంచే మొదలు**

ఈ రోజు వృథా చేసిన సమయం రేపటి భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

మొబైల్‌ను జ్ఞాన సాధనంగా మార్చుకుని,వ్యసనాలకు దూరంగా ఉండి, లక్ష్యంతో ముందుకు సాగితేనే విజయాన్ని అందుకోవచ్చు.

# ట్రై కార్పొరేషన్ లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటో కార్మికులు సహకరించాలి

- ట్రై కార్పొరేషన్ ల కమిషనర్లు
- పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కార్మికులతో ప్రత్యేక సమావేశం
- స్వచ్ఛ ఆటో కార్మికుల సమస్యలను ఓపిగ్గా విన్న కమిషనర్ లు
- కార్మికుల ఉద్యోగ భద్రతకు కమిషనర్ల హామీ
- ప్రమాద బీమా సౌకర్యం వర్తించేదుకు నిర్ణయం.
- రోజూ క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరిస్తామని కమిషనర్ లకు కార్మికుల హామీ

**హైదరాబాద్, ఫిబ్రవరి 20(సమయం న్యూస్):** గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్ మరియు మల్కాజిగిరి కార్పొరేషన్లను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటో టిప్పర్ కార్మికులు పూర్తి సహకారం అందించాలని ట్రై కార్పొరేషన్ల కమిషనర్ లు ఆర్ వి కర్ణన్, జి సృజన, టి వినయ్ కృష్ణారెడ్డి లు సంయుక్తంగా కోరారు.శుక్రవారం సాయంత్రం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు,కార్మికులతో ట్రై కార్పొరేషన్ ల కమిషనర్ లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.స్వచ్ఛ ఆటో టిప్పర్ పారిశుద్ధ్య కార్మికులు సమస్యలను, విజ్ఞప్తుల ను ఓపిగ్గా విన్నారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ , సైబరాబాద్, మల్కాజ్ గిరి కార్పొరేషన్ ల కమిషనర్ లు ఆర్ వి కర్ణన్, జి సృజన, టి వినయ్ కృష్ణారెడ్డి లుమాట్లాడుతూ...క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్ లలో సానిటేషన్ ను మరింత మెరుగుపరచాలని ఇటీవలే స్పష్టం చేశారని అన్నారు. రోడ్లకు ఇరువైపుల, కాలనీలలో చెత్త కనిపించకూడదు అని ఆదేశించారని చెప్పారు. స్వచ్ఛ ఆటో కార్మికుల సహకారం లేకుండా ఇది సాధ్యం కాదనీ కమిషనర్ లు పేర్కొన్నారు.క్యూర్ పరిధిలోని ట్రై కార్పొరేషన్ పరిధిలో త్వరలో అమలు చేయనున్న100 రోజుల కార్యచరణలో ప్రణాళిక అమలులో కూడా సానిటేషన్ కు అత్యధిక ప్రాధాన్యత ఉందన్నారు.సానిటేషన్ పై ఫోకస్ చేయాలంటే ప్రైమరీ కనెక్షన్ పై ఫోకస్ చేయాల్సి ఉంటుందన్నారు. ప్రైమరీ కలెక్షన్ పై ఫోకస్ చేయాలంటే స్వచ్ఛ ఆటో లపై ఫోకస్ చేయాలన్నారు. 100 రోజుల కార్యచరణ అమలుకు స్వచ్ఛ ఆటో కార్మికులు పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు. స్వచ్ఛ ఆటోకు కేటాయించిన ఏరియాలో రోజూ రెగ్యులర్ గా ప్రతి ఒక్క ఇంటి నుండి 100 శాతం చెత్త సేకరణ చేయాలన్నారు. స్వచ్ఛ ఆటో ల ద్వారా ప్రత్యేకించిన ఏరియాలో 100 శాతం ఇండ్ల నుంచి చెత్త సేకరణ జరిగేలా కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికులు పర్యవేక్షణ చేస్తారని కమిషనర్లు తెలిపారు. ఆర్ టి ఓ అధికారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా వీరు చూస్తారని చెప్పారు. చెత్త అన్ లోడింగ్ సమయంలో వెయిటింగ్ పీరియడ్ ను తగ్గిస్తామని స్పష్టం చేశారు.అనవసర వెయిటింగ్ లేకుండా చూసేందుకుఅవసరమైన చోట ఇంటర్మీడియట్ పోర్టబుల్ ట్రాన్స్ఫర్ పాయింట్లను ఏర్పాటు చేస్తామన్నారు. కొత్తగా విలీనమైన పుర పాలికల్లో మ్యాపింగ్ పూర్తి చేసి ప్రతిరోజు ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తామన్నారు. కార్మికులకు ప్రమాదం జరిగితే ఎక్స్ గ్రేసియా చెల్లిస్తామన్నారు. ఉద్యోగ భద్రతకు చర్యలు తీసుకుంటామన్నారు.ఏదేని కారణంతో స్వచ్ఛ ఆటో కార్మికులు విధులకు హాజరు కాలేని పక్షంలో తమ ఎస్ ఎఫ్ ఏ లకు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. తద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. స్వచ్ఛ ఆటో కార్మికులు ట్రై కార్పొరేషన్లను పరిశుభ్రంగా ఉంచడంలో శానిటేషన్ క్యూర్ ఏరియాను నెంబర్ వన్ గా తీర్చిదిద్దడంలో పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా కమిషనర్ కోరారు. సమావేశం చివరలో రోజూ క్రమం తప్పకుండా ప్రతి ఇంటి నుంచి 100 శాతం చెత్త సేకరిస్తామని కమిషనర్ లకు కార్మికులు హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సానిటేషన్ అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, రవి కిరణ్ యాదగిరిరావు, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ లు పాల్గొన్నారు.

# వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్ రూపొందించాలి.

- కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

**హైదరాబాద్ ఫిబ్రవరి20( సమయం న్యూస్). :** 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సోనియా, రాహుల్ రాసిచ్చిన బాండ్ పేపర్లు ఏమాయే.. 800 రోజులైనా ఒక్క హామీకి దిక్కులేదు.

గెలిచిన నెలకే వృద్ధులు, బీడీ, చేనేత, గీత కార్మికులకు రూ. 4000 పెన్షన్ అన్నారు. 27 నెలలైనా రాలేదు. ఈ బడ్జెట్‌లో భట్టి గారు నిధులు పెడతారా, లేదా?

నెలకు రూ. 2500 ఇస్తామని ఆశచూపి మహిళల ఓట్లు దండుకున్నారు. ఒక్కరికైనా రూపాయి ఇచ్చారా.. వెంటనే బడ్జెట్‌లో మహిళలకు నిధులు కేటాయించాలి.

కేసీఆర్ గారు ఇచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ కూడా ఎగ్గొట్టారు. రాజీవ్ యువ వికాసం అంతా బూటకం.

కాంగ్రెస్ తెచ్చిన ఎస్సీ, బీసీ, రైతు డిక్లరేషన్లన్నీ ఉత్త మాటలే. అసెంబ్లీలో మాయ మాటలు మాని.. వాస్తవ బడ్జెట్ ను ప్రవేశపెట్టాలి.

సిద్దిపేట పట్టణంలోని 37వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకిచ్చిన హామీలకు నిధులు కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను డిమాండ్ చేశారు.

**హరీష్ రావు కామెంట్స్:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సగం కాలం పూర్తయింది. ఆనాడు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ, రేవంత్ రెడ్డి అందరూ బాండ్ పేపర్ల మీద రాసిచ్చి 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీలు ఇచ్చారు.

**కానీ, 100 రోజులు కాదు కదా..** 800 రోజులు పూర్తయినా ఇప్పటికీ ఆరు గ్యారెంటీలు అమలవుతున్న దాఖలాలు లేవు.

ఎస్సీ డిక్లరేషన్ పేరిట దళితులకు 18% రిజర్వేషన్లు, ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని మోసం చేశారు. చదువుకునే పిల్లలకు టెన్త్ పాస్ అయితే రూ. 10,000, ఇంటర్ పాస్ అయితే రూ. 25,000, డిగ్రీకి రూ. 50,000, పీజీ చదివితే లక్ష రూపాయలు ఇస్తామని చెప్పి.. ఈరోజు వరకు ఒక్క విద్యార్థికి కూడా ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదు. కనీసం కేసీఆర్ గారు ఇచ్చిన ఫీజు రీయింబర్స్మెంట్ డబ్బులు కూడా రావడం లేదు.

కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సభకు సిద్దరామయ్య గారిని తీసుకొచ్చి, బీసీ సబ్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తామని, ఏటా రూ. 20,000 కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చాక బీసీలకు కాంగ్రెస్ పార్టీ మొండిచేయి చూపింది.

వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ అని చెప్పి రాహుల్ గాంధీ మాయమాటలు చెప్పారు. ఏటా రూ. 15,000 రైతుబంధు, పంటల బీమా, అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి రైతులను నిలువునా దగా చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, యువత.. ఇలా అన్ని వర్గాలను మోసం చేసింది.గతంలో అవ్వాతాతలకు కేవలం రూ. 200 ఉన్న పెన్షన్‌ను కేసీఆర్ గారు రూ. 2,000 చేశారు. కానీ కాంగ్రెస్ నేతలు తాము డిసెంబర్‌లో గెలిచిన మరుసటి నెల నుంచే రూ. 4,000 ఇస్తామని హామీ ఇచ్చారు. 27 నెలలు గడుస్తున్నా ఆ 4000 పెన్షన్ రాలేదు.ఈనెల 26న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో బీడీ కార్మికులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ బాధితులు, గీత మరియు చేనేత కార్మికులందరికీ తక్షణమే రూ. 4,000 పెన్షన్ ఇచ్చేలా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని, ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారిని డిమాండ్ చేస్తున్నాను.మహిళలందరికీ నెలకు రూ. 2,500 చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో వేస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు. ఇప్పటిదాకా ఒక్క మహిళకు కూడా ఆ డబ్బులు ఇవ్వలేదు. తక్షణమే ఈ బడ్జెట్‌లో మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చేలా నిధులు కేటాయించాలి.

గత బడ్జెట్‌లో అసెంబ్లీలో గొప్పగా స్పీచులు దంచి, బల్లలు చరిచి చెప్పిన పథకాలు ఏవీ అమలు కాలేదు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఇప్పటికీ కూలీలకు డబ్బులు అందలేదు, పంటల బీమా రాలేదు.

**యువత కోసం ప్రవేశపెడతామన్న రాజీవ్ యువ వికాసం**

అమలు కాలేదు. ఏ ఒక్క యువతీయువకుడికి ఒక్క రూపాయి కూడా సహాయం చేయలేదు. బడ్జెట్‌లో చెప్పిన మాటలకు కూడా విలువ లేకుండా చేశారు.కనీసం ఈ బడ్జెట్‌నైనా వాస్తవాల ఆధారంగా, వాస్తవికతకు దగ్గరగా రూపొందించాలి. రూ. 4000 పెన్షన్, మహిళలకు నెలకు రూ. 2500 ఇచ్చే హామీలను అమలు చేసేలా ఈ బడ్జెట్‌లో నిధులు పొందుపరచాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాను.

## రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన పపెట్రీ పోటీలలో ప్రథమ బహుమతి సాధించిన ఉపాధ్యాయులకు అభినందనలు



**నారాయణపేట, ఫిబ్రవరి,20(సమయం న్యూస్):** రాష్ట్ర విద్యా పరిశోధన మరియు శిక్షణ మండలిఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పపెట్రీ షో పోటీలు -- యువతలో లింగ సమానత్వ అవగాహన కార్యక్రమంలో నారాయణపేట జిల్లాకు చెందిన అంబిక (పీఎస్ఆ ఖజ ధన్వాడ) మరియు శ్వేత (పీఎస్ఆ కంసానపల్లి) ప్రథమ బహుమతి సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.ఈ పోటీలలో ప్రతి జిల్లాకు ఒక ఉపాధ్యాయ బృందానికి మాత్రమే అవకాశం ఉండగా, బృందంలో గరిష్టంగా 2--3 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రభుత్వ మరియు జిల్లా పరిషత్ పాఠశాలల ఎస్జీటీ/స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు అర్హులుగా ఎంపికయ్యారు. కార్యక్రమం ప్రధాన థీమ్ "యువతలో లింగ సమానత్వ అవగాహన" కాగా, బాలురు-బాలికలు సమానమే, ఇద్దరికీ సమాన హక్కులు-బాధ్యతలు ఉన్నాయనే సందేశాన్ని సృజనాత్మకంగా ప్రదర్శించడం ప్రధాన లక్ష్యంగా నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి గోవింద రాజు మాట్లాడుతూ, "రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహించిన ఈ పోటీలలో ప్రథమ బహుమతి సాధించడం జిల్లా విద్యా రంగానికి గర్వకారణం. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకత, విలువలు, సామాజిక అవగాహన పెంపొందించడంలో చూపిన కృషి అభినందనీయం. ఇలాంటి విజయాలు జిల్లా విద్యా ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయి" అని అభినందించారు.పపెట్రీ కళకు సంబంధించిన శిక్షణను CCRT (Centre for Cultural Resources and Training) ద్వారా నిర్వహిస్తూ ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తున్నందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

## సేవాలాల్ మహారాజ్ చూపించిన సన్మార్గం లో నడవాలి

- రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమ,పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి.



**ఉట్కూరు మండలం, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** మక్తల్ నియోజకవర్గం ఉట్కూర్ మండలం తిమ్మారెడ్డి పల్లి తాండా లో నిర్వహించిన సేవాలాల్287 వ జయంతి ఉత్సవాల్లో మంత్రి పాల్గొన్నారు. బంజారా ప్రజలకు సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...బంజారా ప్రజలకు సేవాలాల్ చేసిన సేవలు చిరస్మరనీయమన్నారు. గిరిజనులకు అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.బంజారాల గురించి ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. సేవాలాల్ చూపించిన మార్గం లోనే అందరూ నడవాలని ఉద్ఘాటించారు.తండాలాల్లో నివసించే ప్రతీ కుటుంబం తమ పిల్లలను చదివించుకోవాలసిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.చదువు ఎవ్వరి సొత్తు కాదని, పిల్లలు చదివితేనే బంగారు భవిష్యత్తు ముందుంటుందని అభిప్రాయపడ్డారు.గొప్ప స్థాయికి ఎదిగి ఉన్న ఊరుకు, కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మంత్రి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా తండా వాసులతో కలిసి మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్పీ వినీత్ రాజ్ లు లంబాడా సాంప్రదాయ నృత్యం చేశారు.

## క్రీడా దుస్తుల వితరణ




Zphs రాయిపోల్ పాఠశాల విద్యార్థులకు అనాజీపూర్ గ్రామ వాస్తవ్యుడు వీ స్వామి కానిస్టేబుల్‌గారు 3000 రూపాయల విలువైన క్రీడా దుస్తులు అందిచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సంతోష్,గ్రామ సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఖ స్వామి, ప్రసాద్,పాఠశాల PD గోవర్ధన్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేట్ బాల్ పోటీలకు ఎల్కల్ క్రీడాకారుడు సతీష్ ఎంపిక



రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామానికి చెందినవ్రా.సతీష్ తేదీ 18- 02- 2026 నాడు గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ కాచిగూడ లో నిర్వహించినఉస్మానియా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ నెట్ బాల్ పోటీలలోఉత్తమ ప్రతిభ కనబరిచిMarch 9 నుండి 13 వరకు సెగ్ యూనివర్సిటీ, మధ్యప్రదేశ్ లో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ నేట్ బాల్ పోటీలలో ఉస్మానియా యూనివర్సిటీ తరుపున పాల్గొంటాడని ప్రాం గోవర్ధన్ రెడ్డి తెలిపారు.సతీష్ ప్రస్తుతం లయోలా డిగ్రీ కాలేజ్, కొంపల్లిలో దీూా ఎకనామిక్స్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.





## నారాయణపేట జిల్లా టీఎన్జీఓ (TNGOs) యూనియన్ నాయకుల మర్యాదపూర్వక భేటీ

- మంత్రి వాకిటి శ్రీహరి ని కలిసిన నూతన కార్యవర్గం యూనియన్ ఏర్పాటుపై హర్షం
- సంఘ భవన నిర్మాణం కొరకు కృషి ..సమస్యల పరిష్కారం: మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట,ఫిబ్రవరి,20 ( సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా టీఎన్జీఓ (TNGOs) యూనియన్ నూతన కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, క్రీడలు మరియు యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా టీఎన్జీఓ యూనియన్ అధ్యక్షులు నరసింహ రెడ్డి మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి నూతన కార్యవర్గ సభ్యులందరినీ శాలువా మరియు పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని కీలక అంశాలను ప్రస్తావించారు:జిల్లాలో మొదటిసారిగా టీఎన్జీఓ యూనియన్ ఏర్పాటు కావడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.జిల్లా కేంద్రంలో టీఎన్జీఓ సంఘ భవనాన్ని ఏర్పాటు చేయడానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా కృషి చేయాలని, జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.పాల్గొన్న ముఖ్యులు: ఈ కార్యక్రమంలో పాలమూరు జిల్లా అధ్యక్షులు రాజీవ్ రెడ్డి, కార్యదర్శి చంద్రు నాయక్, కృష్ణ మోహన్ జిల్లా సెక్రెటరీ దామోదర్, మరియు నూతనంగా ఎన్నికైన సభ్యులు, బాలరాజు, సిద్దిరామరెడ్డి, శివకుమార్, సుజాత, మునవర్ అలీ, శ్రీధర్, మునియప్ప తదితరులు పాల్గొన్నారు.నరసింహ రెడ్డి, అధ్యక్షులు దామోదర, కార్యదర్శి జిల్లా టీఎన్జీఓ యూనియన్ నారాయణపేట జిల్లా

## జీవితంపై విరక్తి చెంది తల్లి తన కుమారునితో సహా ఆత్మహత్య

దర్యాప్తు చేస్తున్న యాలాల ఎస్సై విఠల్ రెడ్డి



**యాలాల మండలం, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఇందిరమ్మ కాలనీలోని బ్లాక్ నంబరు 28లో రూమ్ నెంబర్ 1 లో నివాసముంటున్న బుడిగ జంగం గౌరమ్మ 30( సం) వివాహమై ఒక కొడుకు రవికాంత్ తో నివాసముంటుంది అదే బ్లాగులో తన తల్లిదండ్రులు అన్నదమ్ముల వద్ద ఉంటుంది. శుక్రవారం అందాసా ఐదు గంటల సమయంలో తన అన్న ఆయన తుల్జారాం తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్ళగా గౌరమ్మ తన కొడుకు రవికాంత్ కు ఉరివేసి తాను కూడా ఉరీ వేసుకొని చనిపో యినది జీవితంపై విరక్తి చెంది చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు.ఈట్టి మరణం పై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు.తల్లి పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయడం జరుగుతుందని యాలాల ఎస్సై విఠల్ రెడ్డి తెలిపారు.



Food కమిషన్ చైర్మన్ కలెక్టరేట్ కు చేరుకున్న సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పూల మొక్క అందించి స్వాగతం పలికారు

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు

- సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి
- నివాళులర్పించిన ఆర్డీవో రామచందర్ నాయక్



**నారాయణపేట, ఫిబ్రవరి,20(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎర్ర గుట్ట వద్ద ఏర్పాటు చేసిన సేవలాల్ మహరాజ్ జయంతి వేడుకలలో భాగంగా సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి స్థానిక ఆర్డీవో రామచందర్ నాయక్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రామచందర్ మాట్లాడుతూ.. సేవాలాల్ చూపించిన మార్గంలోనే అందరూ నడవాలన్నారు. బంజారా ప్రజలకు సేవాలాల్ చేసిన సేవలు చిరస్మరణీయం అన్నారు. గిరిజన తండాలలో నివసించే ప్రతీ కుటుంబం తమ పిల్లలను చదివించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ/ ప్రత్యేక అధికారి అబ్దుల్ ఖలీల్, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, నియోజక వర్గంలోని గిరిజన తండాల సర్పంచులు, సేవాలాల్ మహారాజ్ జిల్లా సంఘం సభ్యులు, గిరిజన సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

- బాగ్ లింగంపల్లి గోదాములో ఆకస్మిక తనిఖీ చేసిన
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్



**హైదరాబాద్ ఫిబ్రవరి20( సమయం న్యూస్). :** పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్–ఆఫిషియో కమిషనర్ శ్రీ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ గారు తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ గారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యం లో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్––అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించము," అని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ఈ తనిఖీ లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ శ్రీ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ శ్రీమతి దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు శ్రీ గోపాలకృష్ణ, శ్రీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టిబోయినపల్లి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల తనఖి చేసిన అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్





**మహబూబ్ నగర్ ఫిబ్రవరి20( సమాసం న్యూస్).:** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్‌చిట్టిబోయినపల్లి ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల తనఖి చేసి అక్కడ విద్యార్థినిలతో కలిసి బోజనము చేయడం జరిగింది అలాగే రాజ విద్యార్థిని లతో పరీక్షలు ఏ విధంగా వ్రాయడానికి మెలకువ లు చెప్పారు మరియు చదువుతున్న సమయంలో సబ్జెక్టు లో ప్రాబ్లమ్స్ వస్తే తమ తోటి విద్యార్థినులు గ్రూప్ డిస్కస్ చేసుకోవాలని సూచించారు అలాగే నిత్యం జీవితం లో సమస్యలు ఏ విధంగా ఎదుర్కోవడానికి ధైర్యం చెప్పారు

# నేను ఆడుకున్న మైదానం ఇది.

## అభివృద్ధి చేసే అవకాశం నాకే వచ్చింది

- రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి క్రీడా పాలసీ అమలు
- రాష్ట్రస్థాయి సీఎం కప్ కబడ్డీ పోటీలను ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి.
- నేను చిన్నతనంలో ఇదే మట్టి మైదానంలో ఆడుకున్నా..



**మక్తల్ మున్సిపల్,(మం) ఫిబ్రవరి,20(సమయం న్యూస్)**

ఇప్పుడు క్రీడల శాఖ మంత్రిగా ఈ మైదానాన్ని అభివృది చేసే అవకాశం నాకు వచ్చింది. ఈ మక్తల్ మినీ స్టేడియం అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేశాం. త్వరలో పనులు కూడా ప్రారంభిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా మక్తల్ జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం ఏర్పాటుచేసిన రాష్ట్రస్థాయి సీఎం కప్ సెకండ్ ఎడిషన్ కబడ్డీ పోటీలను మొదటగా సరస్వతి దేవి,హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడల జెండా ఆవిష్కరించి, క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను మంత్రి ప్రారంభించారు. 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి మంత్రి,జిల్లా కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ కబడ్డీ పోటీలు శుక్రవారం ప్రారంభమై నాలుగు రోజుల పాటు అట్టహాసంగా కబడ్డీ పోటీలు జరగనున్నాయి. ఈ కబడ్డీ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి వచ్చిన 60 జట్లు పోటీలలో పాల్గొననున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారులు హాజరయ్యారు.

**సిఎం కప్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.....** రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల నిర్వహణ కోసం మక్తల్ కు అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ కు ధన్యవాదాలు తెలిపారు. తాను చిన్న తనంలో ఇక్కడే ఈ మట్టి లో ఆడేవాళ్ళమనీ,ఈ మట్టిలో ఆడిన వ్యక్తి గా ఇక్కడ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. గచ్చిబౌలిలో జరగాల్సిన రాష్ట్ర స్థాయి క్రీడలను మక్తల్ కు తీసుకొచ్చామని, ఇది ఈ ప్రాంతానికి ఎంతో ఖ్యాతిని తీసుకొచ్చిందని, మక్తల్ లో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను విజయవంతం చేస్తామని,33 జిల్లా నుండి 1200 మంది క్రీడాకారులు ఇక్కడికి వచ్చారనీ, మక్తల్ మినీ స్టేడియంకు 25 కోట్ల మంజూరు చేశామని పునరుద్ఘాటించారు. జిల్లా కలెక్టర్ కోరిక మేరకు నారాయణ పేట జిల్లా కేంద్రంలోని మైదానం అభివృద్ధి కోసం కూడా 25కోట్లు మంజూరు చేశామని స్పష్టం చేశారు. క్రీడలకు రాష్ట్ర బడ్జెట్ లో 1600 వందల కోట్ల కేటాయిస్థామని, క్రీడాకారుల కోసం 25 కోట్లతో గచ్చిబౌలిలో స్పోర్ట్స్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. 125 మంది చిన్నారి వివిధ క్రీడల్లో రాణించడంతో క్రీడాకారులకు రవాణా చార్జీలు ప్రభుత్వం 6కోట్ల 50 లక్షల చెల్లించిందని తెలిపారు. మక్తల్ లో ఆడుతున్న 33 జిల్లాల కబడ్డీ క్రీడాకారుల జాతీయస్థాయిలో రాణించడానికి మంచి అవకాశముందన్నారు. కబడ్డీ క్రీడ మట్టి వాసన నుండి పుట్టిన క్రీడ అని, రాష్ట్ర స్థాయిలో క్రీడాకారులు ఆటలో నైపుణ్యం ప్రదర్శించాలి తద్వారా జాతీయ స్థాయికి సెలెక్ట్ కాగలుగుతారని సూచించారు. జాతీయ స్థాయిలో ఆడితే క్రీడాకారులకు సంబంధించిన ఖర్చు అంతా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు 3 కోట్ల రూపాయల పారితోషికం ఇస్తున్నామన్నారు. క్రీడల, క్రీడాకారుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ఎంతో సానుకూలంగా ఉన్నారని మంత్రి పేర్కొన్నారు. గ్రామీణ స్థాయి క్రీడా కారులను వెలికితేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం స్పోర్స్ పాలసీ తీసుకొచ్చిందనీ చెప్పారు. బడ్జెట్ లో ఈ సారి స్పోర్ట్స్ కు అధిక నిధులు కేటాయించబోతున్నామని వెల్లడించారు. గ్లోబల్ సుమ్మిట్ లో క్రీడా శాఖ కి 25 వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయనీ తెలిపారు. మక్తల్ లో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించడంతో తన సంకల్పం నెరవేరిందని, కానీ ఇది ఆరంభం మాత్రమేనని మంత్రి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ..సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతి జిల్లాకు ఒక ఆటను ఎంపిక చేశారని, మన జిల్లాకు కబడ్డిని ఎంపిక చేయగా రాష్ట్రంలోనే ఇదే మొదటి ఈవెంట్ అని తెలిపారు. ఇది మంచి అవకాశమని, జిల్లాకే గర్వకారణమన్నారు. ముఖ్యమంత్రి ఆశీస్సులతోనే రాష్ట్రంలో క్రీడలకు ప్రాధాన్యత వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం అందరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెడుతున్నారని, ఇలాంటి క్రీడల నిర్వహణతో వాటిపై యువకులు, ప్రజల్లో ఆసక్తి పెరుగుతుందని ఆమె తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వచ్చిన క్రీడాకారులు, కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల పాటు ఇక్కడే మహిళలు,పురుషులకు వేర్వేరుగా బస ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే అల్పాహారం, భోజనం, ఇతర వసతి సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. మూడు రోజుల పాటు క్రీడాకారులు ఆడే కబడ్డీ ఆటను చూసి మిగతా విద్యార్థులు నేర్చుకునే అవకాశం ఉందన్నారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అందరికీ ఈ సందర్భంగా కలెక్టర్ ఆల్ ది బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కుమార్ మాట్లాడుతూ.. ఆటలలో కబడ్డీ కల్చరల్ కింగ్ అని అన్నారు. దేశంలో కబడ్డీ ఆటకు ఎంతో ప్రాధాన్యం ప్రాముఖ్యత, ప్రత్యేక స్థానం ఉందని చెప్పారు. 4 వేల సంవత్సరాల చరిత్ర కబడ్డీకి ఉందన్నారు. మన దేశం ఇప్పటిదాకా కబడ్డీలో మూడు సార్లు ప్రపంచ కప్ సాధించిందని ఎస్పీ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి జిల్లా కలెక్టర్, ఎస్పీ తో కలిసి గ్రౌండ్ లోకి వెళ్ళి క్రీడాకారులతో కబడ్డీ ఆడి లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస, వైస్ చైర్ పర్సన్ శైవి రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రాధా లక్ష్మారెడ్డి, డిఇఓ గోవిందరాజులు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేష్ శెట్టి, బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, కోచ్ లు, వ్యాయామ ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.



# జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని

- డి.పి.ఆర్.ఓ.లను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమీషనర్ సి.హెచ్. ప్రియాంక



**హైదరాబాద్ ఫిబ్రవరి20( సమయం న్యూస్) :** శుక్రవారంనాడు నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమి ఆడిటోరియంలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ విధి విధానాలపై డి.పి.ఆర్.ఓ.లకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జి.ఓ. నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పి.ఆర్.ఓ.లకు సూచించారు. జిల్లాస్థాయి అక్రిడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రిలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవుడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్‌మెంట్, అక్రిడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులను ఆస్కారం లేకుండా అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆమె కోరారు. తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వం జారీ చేసిన మార్గ దర్శకాల ప్రకారం రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలో అక్రిడిటేషన్ కార్డులను జారీ చేయాలని డి.పి.ఆర్.ఓ.లను ఆయన కోరారు. క్షేత్రస్థాయిలో అక్రిడిటేషన్ జారీలో ఏమైన సమస్యలు ఉంటే స్పెషల్ కమీషనర్ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఈ శిక్షణా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల డి.పి.ఆర్.ఓ.లు, సంబంధిత సిబ్బంది హాజరయ్యారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి అధికారులకు అక్రిడిటేషన్ కార్డుల జారీపై ఆన్ లైన్ విధి విధానాలపై క్షేత్రస్థాయి సిబ్బందికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కలిగించారు. శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయి సిబ్బంది లేవనెత్తన అంశాలపై మీడియా రిలేషన్ విభాగం అధికారులు డి.ఎస్.జగన్, యామిని, వెబ్ సైట్ టీమ్ మేనేజర్ నంద, టెక్నిషన్ సాయిలు అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. అర్హత గల జర్నలిస్టులు http://ipr.telangana.gov.in ద్వారా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే సెల్ నెం.: 9154170881ను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ అదనపు సంచాలకులు డి.ఎస్. జగన్, తెలంగాణ మీడియా అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాస్, రమణ, మధుసుదన్, జాయింట్ డైరెక్టర్లు వై. వెంకటేశ్వర్లు, హష్మీ, రాజారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ యామిని, పాల్గొన్నారు.

# ఆస్ట్రేలియా ఘన విజయం!

## తొమ్మిది వికెట్ల తేడాతో ఒమన్ చిత్తు.. ఊరట గెలుపుతో ఆసీస్ వీడ్కోలు

- 104 పరుగులకే కుప్పకూలిన ఒమన్ బ్యాటింగ్ లైనప్
- నాలుగు వికెట్లతో చెలరేగిన ఆడమ్ జంపా
- ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డ మిచెల్ మార్ష్ (64 నాటౌట్)



**కాండీ (శ్రీలంక):** టి20 ప్రపంచకప్‌లో ఇప్పటికే సూపర్-ఎయిట్ అవకాశాలను కోల్పోయి తీవ్ర నిరాశలో ఉన్న ఆస్ట్రేలియా జట్టు.. తమ ఆఖరి లీగ్ మ్యాచ్ లో ఒమన్ పై ప్రతాపం చూపించింది. శుక్రవారం పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా జరిగిన గ్రూప్-బి నామమాత్రపు మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో ఒమన్ ను చిత్తు చేసింది. బౌలింగ్‌లో ఆడమ్ జంపా (4/21), బ్యాటింగ్ లో కెప్టెన్ మిచెల్ మార్ష్ అద్భుత అర్ధ శతకంతో రాణించడంతో ఆసీస్ అలవోక విజయాన్ని అందుకుంది. ఈ ఓదార్పు గెలుపుతో గ్రూప్-బిలో మూడో స్థానంతో ఆస్ట్రేలియా టోర్నీ నుంచి నిష్క్రమించింది. 2009 తర్వాత టి20 ప్రపంచకప్ లో ఆసీస్ గ్రూప్ దశలోనే వెనుదిరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.



### కట్టుదిట్టమైన బౌలింగ్.. తడబడిన ఒమన్

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. ఆస్ట్రేలియా బౌలర్లు కచ్చితమైన లైన్, లెంగ్త్ తో దాడి చేయడంతో ఒమన్ బ్యాటర్లు ఏ దశలోనూ నిలదొక్కుకోలేకపోయారు. ఇన్నింగ్స్ తొలి బంతికే అమీర్ కలీమ్ ను క్లీన్ బౌల్డ్ చేసిన పేసర్ జేవియర్ బార్ట్ లెట్.. ఆసీస్ కు అదిరిపోయే శుభారంభం ఇచ్చాడు. ఆ తర్వాత వరుస విరామాల్లో ఒమన్ వికెట్లు కోల్పోతూ కష్టాల్లో పడింది. మిడిలార్డర్ లో వసీం అలీ (32 పరుగులు) కాసేపు ఒంటరి పోరాటం చేశాడు. జతీందర్ సింగ్ (17), హమ్మద్ మీర్జా (16) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ కే పరిమితమయ్యారు. ముఖ్యంగా స్పిన్నర్ ఆడమ్ జంపా వరుస బంతుల్లో వికెట్లు పడగొట్టి ఒమన్ పతనాన్ని శాసించాడు. దీంతో 16.2 ఓవర్లలో కేవలం 104 పరుగులకే ఒమన్ జట్టు కుప్పకూలింది. ఆసీస్ బౌలర్లలో జంపా నాలుగు, బార్ట్ లెట్ రెండు, మ్యాక్స్ వెల్ రెండు వికెట్లు పడగొట్టగా.. నాథన్ ఎల్లిస్, మార్కస్ స్టోయినిస్ తలో వికెట్ తీశారు.

### రెచ్చిపోయిన మార్ష్.. సునాయాస ఛేదన

105 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా బ్యాటర్లు ఏమాత్రం తడబడలేదు. ఓపెనర్లు మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ తొలి ఓవర్ నుంచే ఒమన్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఫోర్లు, సిక్సర్లతో చెలరేగుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. పవర్ ప్లే ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 73 పరుగులు రాబట్టారు. 33 బంతులు ఎదుర్కొన్న మార్ష్.. 7 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరో ఎండ్ లో ట్రావిస్ హెడ్ (32) ధాటిగా ఆడుతూ షకీల్ అహ్మద్ బౌలింగ్ లో వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన జోష్ ఇంగ్లిస్ (12 నాటౌట్) మిగతా లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఆస్ట్రేలియా కేవలం 9.4 ఓవర్లలో వికెట్ నష్టపోయి 108 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన కనబరిచిన ఆడమ్ జంపాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.



# ఫైనల్‌లో భారత మహిళల ఏ జట్టు!

## సెమీస్‌లో శ్రీలంక ఏ పై ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం

### నాలుగు వికెట్లు, అజేయంగా 31 పరుగులతో చెలరేగిన రాధా యాదవ్

## ఆదివారం బంగ్లాదేశ్ ఏ తో టైటిల్ పోరు

**బ్యాంకాక్:** మహిళల ఏషియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో భారత ఏ జట్టు సత్తా చాటింది. టైటిల్ దక్కించుకోవడమే లక్ష్యంగా బరిలోకి దిగిన యువ భారత్.. దర్జాగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం బ్యాంకాక్ వేదికగా జరిగిన తొలి సెమీ ఫైనల్ పోరులో శ్రీలంక ఏ జట్టును 5వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన రాధా యాదవ్ (4వికెట్లు, 31పరుగులు నాటౌట్) ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించింది.

### రాధా యాదవ్ స్పిన్ మాయాజాలం..

ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన భారత జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. భారత బౌలర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు ఏ దశలోనూ కోలుకోలేకపోయారు. ముఖ్యంగా రాధా యాదవ్ తన స్పిన్ మాయాజాలంతో ప్రత్యర్థి వెన్నువిరిచింది. కచ్చితమైన లెంగ్త్ తో బంతులు విసురుతూ కీలకమైన నాలుగు వికెట్లు పడగొట్టి శ్రీలంక పతనాన్ని శాసించింది. మిగతా బౌలర్లు కూడా కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో ఆ జట్టు 19.4 ఓవర్లలో కేవలం 118 పరుగులకే కుప్పకూలింది.

### దంచికొట్టిన బృందా దినేశ్..

119 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్ బృందా దినేశ్ (42 పరుగులు) అదిరిపోయే శుభారంభం ఇచ్చింది. క్రీజులోకి వచ్చినప్పటి నుంచే శ్రీలంక బౌలర్లపై విరుచుకుపడుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. అయితే, మిడిలార్డర్ లో స్వల్ప తడబాటుతో భారత జట్టు వరుసగా వికెట్లు కోల్పోయి కాస్త కష్టాల్లో పడినట్లు కనిపించింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రాధా యాదవ్.. ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడింది. అజేయంగా 31 పరుగులు సాధించి జట్టును విజయతీరాలకు చేర్చింది. దీంతో భారత జట్టు కేవలం 13.3 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి 119 పరుగులు సాధించి దర్జాగా ఫైనల్ లో అడుగుపెట్టింది. బౌలింగ్ లో నాలుగు వికెట్లు తీయడంతో పాటు బ్యాటింగ్ లోనూ అద్భుతంగా రాణించిన రాధా యాదవ్ కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ ఘన విజయంతో ఊపుమీదున్న భారత జట్టు, ఆదివారం జరగనున్న ఫైనల్ సమరంలో బంగ్లాదేశ్ ఏ జట్టుతో అమీతుమీ తేల్చుకోనుంది.

# నేటి నుంచి సూపర్-8 సమరం!




- గ్రూప్ దశను దాటి సత్తా చాటనున్న ఎనిమిది మేటి జట్లు
- కొలంబో వేదికగా న్యూజిలాండ్, పాకిస్థాన్ మధ్య తొలి పోరు
- రేపు అహ్మదాబాద్ లో దక్షిణాఫ్రికాతో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

**అహ్మదాబాద్ :** క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న టీ20 ప్రపంచకప్ సూపర్-8 పోరుకు రంగం సిద్ధమైంది. లీగ్ దశలో తమదైన ఆటతో ఆకట్టుకున్న ఎనిమిది మేటి జట్లు ఇక అసలు సిసలు సమరానికి సై అంటున్నాయి. కొలంబో వేదికగా శనివారం (ఫిబ్రవరి 21న) పాకిస్థాన్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్ తో ఈ సెకండ్ ఫేజ్ మొదలుకానుంది. ట్రోఫీ దిశగా అడుగులు వేయాలంటే ఇక్కడి నుంచి ప్రతి మ్యాచ్ అత్యంత కీలకమే. ఈ నేపథ్యంలో రెండు గ్రూపుల్లోని జట్ల బలాబలాలు, వాటి ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందో ఒకసారి పరిశీలిద్దాం.


### గ్రూప్-1: టైటిల్ ఫేవరెట్ల సమూహం

ఈ గ్రూపులో భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే జట్లు ఉన్నాయి. సొంతగడ్డపై ఆడుతుండటం టీమిండియాకు అతిపెద్ద బలం. బ్యాటింగ్ లో టాప్ ఆర్డర్ అద్భుత ఫామ్ లో ఉంది. ముఖ్యంగా పిచ్ లు స్పిన్ కు అనుకూలిస్తున్న నేపథ్యంలో భారత స్పిన్నర్లు ప్రత్యర్థి బ్యాటర్లకు సింహస్వప్నంగా మారే అవకాశం ఉంది. లీగ్ దశలో ఓటమెరగకుండా దూసుకొచ్చిన టీమిండియా.. కచ్చితంగా టైటిల్ ఫేవరెట్లలో ఒకటి. రేపు (ఫిబ్రవరి 22న) అహ్మదాబాద్ వేదికగా దక్షిణాఫ్రికాతో తొలి మ్యాచ్ ఆడనుంది. బ్యాటింగ్, పేస్ బౌలింగ్ విభాగాల్లో అత్యంత సమతూకంగా ఉన్న జట్టు దక్షిణాఫ్రికా. భారీ హిట్టర్లకు ఏమాత్రం కొదవ లేదు. అయితే నాకౌట్, కీలక మ్యాచుల్లో ఒత్తిడికి చిత్తయ్యే పాత అలవాటును వదిలించుకుంటే ఈ జట్టును ఆపడం ప్రత్యర్థులకు పెను సవాలే. టీ20 ఫార్మాట్ కు పెట్టింది పేరు కరీబియన్లు. భారీ సిక్సర్లు కొట్టే బ్యాటర్లతో ఏ క్షణంలోనైనా మ్యాచ్ స్వరూపాన్ని మార్చేయగల సత్తా వెస్టిండీస్ కు ఉంది. లీగ్ దశలో కాస్త తడబడినా, సూపర్-8లో వీరు మరింత ప్రమాదకరంగా మారే ఛాన్స్ ఉంది. పెద్దగా అంచనాలు లేకుండా బరిలోకి దిగుతున్న జింబాబ్వే జట్టు అండర్ డాగ్ గా సత్తా చాటేందుకు చూస్తోంది. లీగ్ దశలో సమిష్టి కృషితో సంచలనాలు సృష్టించి ఇక్కడిదాకా చేరుకుంది. పెద్ద జట్లకు షాకివ్వగల సామర్థ్యం వీరికి ఉంది.

### గ్రూప్-2: ఉత్కంఠ రేపే పోరు

ఈ గ్రూపులో శ్రీలంక, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. టోర్నీకి సహ ఆతిథ్యం ఇస్తున్న శ్రీలంక.. సొంత పరిస్థితులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని చూస్తోంది. సొంత ప్రేక్షకుల మద్దతు వీరికి అదనపు బలం. స్పిన్నర్లే ఆ జట్టుకు ప్రధాన ఆయుధం. బ్యాటర్లు నిలకడగా రాణిస్తే సెమీస్ చేరే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎప్పుడు ఎలా ఆడుతుందో ఊహించడం కష్టమైన జట్టు పాకిస్థాన్. అద్భుతమైన పేస్ బౌలింగ్ దళం ఆ జట్టు సొంతం. కెప్టెన్ బాబర్ ఆజం ఫామ్ లోకి రావడం ఆ జట్టుకు సానుకూలాంశం. లీగ్ దశలో ఆకట్టుకున్న ఈ జట్టు, సూపర్-8లో తొలి పోరులో న్యూజిలాండ్ తో అమీతుమీ తేల్చుకోనుంది. తొలి బంతి నుంచే ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించాలనే దూకుడుతో ఆడే జట్టు ఇంగ్లండ్. బ్యాటింగ్ లో చాలా లోతు ఉంది. ఎనిమిదో స్థానం వరకు భారీ హిట్టర్లు ఉన్నారు. బౌలింగ్ పదును పెంచుకుంటే ఈ జట్టు కూడా ట్రోఫీ రేసులో బలంగా నిలబడుతుంది. ఐసీసీ టోర్నీల్లో ఎంతో క్రమశిక్షణతో ఆడే జట్టు కివీస్. ప్రతి టోర్నీలోనూ ఎలాంటి హడావుడి లేకుండా నిలకడగా రాణిస్తూ సెమీస్ చేరుకోవడం న్యూజిలాండ్ కు అలవాటు. ఫీల్డింగ్ లో అదరగొట్టే ఈ జట్టు, ఏ ప్రత్యర్థినైనా దీటుగా ఎదుర్కొనే వ్యూహాలతో బరిలోకి దిగనుంది. లీగ్ దశ ముగిసిపోవడంతో, ఇక అసలైన క్రికెట్ మజా ప్రేక్షకులకు దక్కనుంది. ప్రతి మ్యాచ్ ఫైనల్ ను తలపించేలా సాగడం ఖాయంగా కనిపిస్తోంది.

# అంతర్జాతీయ క్రికెట్‌కు స్టార్ క్రికెటర్ గుడ్ బై




**చెన్నై:** టీ20 ప్రపంచ కప్ 2026లో మరో మ్యాచ్‌తో గ్రూప్ స్టేజ్ ముగియనుంది. దీంతో అనేక జట్ల ప్రయాణం ముగిసింది. ఎనిమిది జట్లు ఇప్పటికే సూపర్ 8 దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో కెనడా క్రికెట్ చరిత్రలోనే విజయవంతమైన ఆటగాడు, ఆ జట్టు మాజీ కెప్టెన్ నవనీత్ ధలివాల్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. గురువారం చెన్నైలోని చిదంబరం స్టేడియం వేదికగా అఫ్గానిస్థాన్ జట్టుతో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్ అనంతరం తన 11 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు.

### కోచ్‌గా సరికొత్త ఇన్నింగ్స్..

మైదానాన్ని వీడినా.. క్రికెట్‌ను వీడనని నవనీత్ తెలిపాడు. కెనడాలో అట్టడుగు స్థాయిలో ఉన్న యువ క్రికెటర్లను తీర్చిదిద్దేందుకు కోచింగ్ వైపు వెళ్లనున్నట్టు ప్రకటించాడు. 19 ఏళ్ల యువ ఆటగాడు యువరాజ్ సమ్రా.. న్యూజిలాండ్‌పై సెంచరీ బాదడం చూస్తుంటే కెనడా క్రికెట్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉందని తాను నమ్ముతున్నట్టు ఆశాభావం వ్యక్తం చేశాడు. కాగా ఈ టోర్నీలో కెనడా గ్రూప్ స్టేజిలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే.

# చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా




## కపుల్ ఫ్రెండ్లీ మరో గీతాంజలి అంటూ ప్రభాస్ కితాబు


నటుడు ప్రభాస్ ఫుడ్ లవర్.. ఆయన వెరైటీ ఫుడ్ ఇష్టపడతారు. అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష్' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్‌లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి మీరు మామూలు వాళ్లు కాదండీ' అంటూ చేసిన కామెంట్స్‌ను ప్రభాస్ గుర్తుచేసుకున్నారు. 'కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని అగ్రనటుడు ప్రభాస్ అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయవాడ పునుగులు అంటే తనకు ఇష్టమని చెప్పారు. నేను అభిమానుల కోసం సంవత్సరానికి మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నాను. కానీ, ఒక్కటే విడుదలవుతోంది. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. నాకు అన్ని జానర్‌ల పైనా ఆసక్తి ఉంది. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని అంటూ 'కపుల్ ఫ్రెండ్లీ' చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకున్నానన్నారు. పూరి జగన్నాథ్‌లా ఎవరూ రాయలేరు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన్' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. నా సినిమాల్లో కాస్ట్యూమ్స్ కూడా డిఫరెంట్‌గా ఉండేలా చూస్తాను అన్నారు. మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు. ఈ సినిమా చూశాక ప్రేమలో పడాలని ఉందన్నారు. హీరో సంతోశ్ శోభన్ అడిగిన వెంటనే.. అతడికి ఫోన్ నంబరు ఇచ్చారు. ఈ మూవీ బ్యాక్‌డ్రాప్ గురించి ప్రభాస్ మాట్లాడుతూ.. చెన్నైలో తాను గడిపిన రోజులు గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌కు హిట్ ఇచ్చిన 'వర్షం' డైరెక్టర్ శోభన్ తనయుడే ఈ సంతోశ్.




## ఉస్తాద్ నుంచి 22న మరో సాంగ్ విడుదల

గబ్బర్‌సింగ్' తర్వాత పవన్ కల్యాణ్ – డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ఈ చిత్రం విడుదల కానున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌లో జోష్ పెంచింది. ఇప్పటికే ఓ పాటను రిలీజ్ చేయగా.. తాజాగా 'ఆరా ఆఫ్ ఉస్తాద్' సాంగ్ ప్రోమోను పంచుకుంది. పూర్తిపాటను ఈ నెల 22న విడుదల చేయనుంది. విజువల్స్, మ్యూజిక్‌ని బట్టి ఈ సాంగ్ పవర్‌ఫుల్‌గా ఉండనున్నట్లు తెలుస్తోంది.



## యశ్ టాక్సిక్ టీజర్ విడుదల

యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజెబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు. విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ్ కనిపించారు.



## డాటర్ ఆఫ్ ప్రసాదరావు ట్రైలర్ విడుదల

రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు'. త్వరలోనే ఈ మూవీ విడుదల కాబోతోంది. 'రెక్కీ', 'విరాటపా లెం' మేకర్స్ నుంచి రాబోతోన్న మరో ఆస క్తికర థ్రిల్లర్ మూవీ ఇది. కృష్ణ పోలూరు దర్శకత్వం వహించారు. ఈ సినిమాని ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ చేయనున్నారు. ఈ క్రమంలో ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేశారు.

# వినోదాల 'హే బల్‌వంత్'

## నవ్వుల పందేనికి సుహాస్ సిద్ధం!



**పెద్ద స్టార్ కాస్ట్ లేకపోయినా, బలమైన కథా బలముంటే చిన్న సినిమాలు కూడా థియేటర్లలో భారీ విజయాలు సాధిస్తాయని ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాలు నిరూపించాయి. అదే బాటలో బన్నీ వాస్, వంశీ నందిపాటి నిర్మాణంలో సుహాస్ కథానాయకుడిగా వచ్చిన తాజా చిత్రం 'హే బల్‌వంత్'. వినూత్నమైన ప్రమోషన్లతో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఏ మేరకు మెప్పించిందో చూద్దాం.**

కృష్ణ (సుహాస్) చిన్నప్పటి నుంచే తన తండ్రి బల్‌వంత్ (నరేష్) చేసే వ్యాపారాన్నే వారసత్వంగా స్వీకరించాలని అనుకుంటాడు. అయితే ఆ వ్యాపారం ఏమిటో తండ్రి ఎప్పుడూ చెప్పడు. చదువు పూర్తయ్యాక ఇంటికి వచ్చిన కృష్ణ, అనారోగ్యంతో ఉన్న తండ్రి స్థానంలో ఆఫీస్ బాధ్యతలు చేపట్టేందుకు వెళ్లి షాక్‌కు గురవుతాడు. ఇంతకీ ఆ రహస్య వ్యాపారం ఏంటి? దానివల్ల కృష్ణ ప్రేమకు, తండ్రితో ఉన్న బంధానికి ఎలాంటి చిక్కులు ఎదురయ్యాయన్నదే ఈ చిత్ర కథాంశం.

### మనసును హత్తుకునే ముగింపు

దర్శకుడు గోపి అచ్చర వినోదాన్ని పంచుతూనే అంతర్లీనంగా ఒక మంచి ఎమోషన్‌ను చెప్పడంలో సఫలమయ్యారు. సినిమా ప్రథమార్ధంలో వచ్చే సీక్రెట్ బిజినెస్ కామెడీ, కృష్ణ బిజినెస్ ఐడియాలు, లవ్ ట్రాక్ సరదాగా సాగిపోతాయి. ముఖ్యంగా ఇంటర్వెల్‌కు ముందు వచ్చే ప్రకృతి వైద్యం ఎపిసోడ్ కడుపుబ్బ నవ్విస్తుంది. సుహాస్, సుదర్శన్, వెన్నెల కిశోర్ల కామెడీ ట్రాక్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ద్వితీయార్థంలో కథ కిడ్నాప్ డ్రామా వైపు మళ్లినా, వెన్నెల కిశోర్ లవ్ ట్రాక్, అజయ్ ఘోష్ సన్నివేశాలు వినోదాన్ని పంచుతాయి. ముగింపులో తండ్రి–కొడుకుల భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించారు.

### నటనలో సుహాస్ మార్కు:

సుహాస్ తనదైన శైలిలో కామెడీ, ఎమోషన్ సీన్లలో మరోసారి మెప్పించాడు. మిత్ర పాత్రలో శివాని నాగారం ఉత్సాహంగా కనిపించగా, తండ్రి పాత్రలో నరేష్ నటన వినోదాత్మకంగా ఉంది. సుదర్శన్ కామెడీ టైమింగ్, వెన్నెల కిశోర్, హర్ష వర్ధన్, అజయ్ ఘోష్ పాత్రలు కథకు చక్కని వినోదాన్ని



జోడించాయి. వివేక్ సాగర్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సన్నివేశాలకు బలాన్ని ఇచ్చింది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి.

**చివరగా:** నవ్వుతూనే మనసును హత్తుకునే తండ్రి–కొడుకుల కథ 'హే బల్‌వంత్'.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**



# డ్రగ్స్ రహిత తెలంగాణే లక్ష్యం

**ఎక్సైజ్ అధికారులకు ఆయుధాలు.. ప్రత్యేక శిక్షణకు చర్యలు**

**కానిస్టేబుల్ సౌమ్య బలిదానం వృథా పోనివ్వం**

**డ్రగ్స్ కట్టడికి అంకితభావంతో పని చేస్తున్న అధికారులకు అభినందనలు**

**ఎక్సైజ్ అధికారుల డైరీ ఆవిష్కరణలో మంత్రి జూపల్లి కృష్ణారావు**

(టీ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)


మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రొహిబిషన్ & ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను శుక్రవారం రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు కోరల్లో చిక్కి ఎంతోమంది యువత భవిష్యత్తు నాశనమవుతోంది.. ఎన్నో కుటుంబాలు చితికిపోతున్నాయి. తలిదండ్రుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఇలాంటి అరాచక శక్తులను సమాజం నుంచి ఏరిపారేయాలి. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే మన లక్ష్యం కావాలి అని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉంది. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తాం అని జూపల్లి ప్రకటించారు. అక్రమ మద్యం నియంత్రణ, మాదక ద్రవ్యాల నిర్మూలనకు అంకితభావంతో పని చేస్తున్న అధికారులను ఈ సందర్భంగా మంత్రి జూపల్లి అభినందించారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల కట్టడికి అధికారులు తమ శక్తివంచన లేకుండా కృషి చేయాలని, ఈ పోరాటంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అధికారుల వెంటే ఉంటుందని, అవసరమైన వనరులు కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన సహాయ సాకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ (ఎన్ ఫోర్స్‌మెంట్) జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# షమీ కేసుల బదిలీపై సుప్రీంకోర్టు నోటీసులు

**కోల్‌కతా నుండి ఢిల్లీకి మార్చాలని హసీన్ జహాన్ పిటిషన్**

**నోటీసులు జారీ చేసిన జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం**






(బీ గణేష్ గౌడ్ సీనియర్ జర్నలిస్ట్ 81212 04666)

భారత క్రికెటర్ మహమ్మద్ షమీపై ఆయన భార్య హసీన్ జహాన్ దాఖలు చేసిన కేసుల బదిలీ పిటిషన్లపై సుప్రీంకోర్టు స్పందించింది. గృహ హింస చట్టం మరియు మనోవర్తి (భరణం) కేసులను కోల్‌కతా నుండి ఢిల్లీకి బదిలీ చేయాలని కోరుతూ ఆమె దాఖలు చేసిన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం ఈరోజు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ మనోజ్ మిశ్రా మరియు జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**పిటిషన్‌లోని ప్రధానాంశాలు**

పిటిషనర్ హసీన్ జహాన్ తన కుమార్తె అభివృద్ధిని, తన వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కేసులను ఢిల్లీకి బదిలీ చేయాలని కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఆమె ఢిల్లీలో నివసిస్తున్నారని, తన కుమార్తె పెంపకం బాధ్యత అంతా తనపైనే ఉందని పేర్కొన్నారు. తనకు స్వతంత్ర ఆదాయ వనరులు లేవని, ప్రతి విచారణకు కోల్‌కతా వెళ్లడం తీవ్ర ఇబ్బందులతో కూడుకున్న వ్యవహారమని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. షమీకి తగినంత ఆర్థిక వనరులు ఉన్నాయని, మ్యాచ్‌ల నిమిత్తం దేశవిదేశాలు తిరిగే ఆయనకు ఢిల్లీలో కేసులు వాదించడం పెద్ద సమస్య కాదని ఆమె వాదించారు. షమీ కుటుంబం ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహాలో నివసిస్తుందని, కాబట్టి కేసులను ఢిల్లీకి బదిలీ చేయడం రెండు పార్టీలకు కూడా సౌకర్యవంతంగా ఉంటుందని పిటిషన్‌లో పేర్కొన్నారు.

# అమీర్‌పేటలో పెను ప్రమాదం

- 50 మంది ప్రాణాలను కాపాడిన హైడ్రా!
- 3 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి డీఆర్ ఎఫ్ బృందాలు
- రోప్ ల్యాడర్ల ద్వారా బాధితుల తరలింపు.. క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ రంగనాథ్

(టీ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)



నగరంలోని అత్యంత రద్దీ ప్రాం తమైన అమీర్‌పేటలో శుక్రవారం పెను అగ్నిప్రమాదం తప్పింది. హైడ్రా డీఆర్ ఎఫ్ బృందాలు మెరుపు వేగంతో స్పందించి, మంటలను అదుపు చేయడంతో పాటు భవనంలో చిక్కుకున్న సుమారు




50 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి.

**3 నిమిషాల్లో మెరుపు స్పందన:**

అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ నీలగిరి బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డులో ఉదయం 11:01 గంటలకు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న కంట్రోల్ రూమ్ వెంటనే క్షేత్రస్థాయిలో ఉన్న బృందాలను అప్రమత్తం చేసింది. సమీపంలోనే ఉన్న డీఆర్ ఎఫ్ బృందం సరిగ్గా 11:04 గంటలకు (కేవలం 3 నిమిషాల్లో) ఘటనా స్థలానికి చేరుకుంది. వెంటనే ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లతో మంటలను నియంత్రించడం ప్రారంభించింది. మెట్ల మార్గం వద్దే కేబుళ్లు తగలబడి పొగలు కమ్మేయడంతో రెండో అంతస్తులో ఉన్నవారు భయాందోళనకు గురయ్యారు. హైడ్రా సిబ్బంది తమ వద్ద ఉన్న అధునాతన రోప్ ల్యాడర్ల సాయంతో వారిని ఒక్కొక్కరిగా కిందకు దించారు. ఫైర్, పోలీస్ విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సాగించిన ఈ ఆపరేషన్‌లో ఎవరికీ ఎటువంటి ప్రాణహాని కలగలేదు. ఏమాత్రం ఆలస్యమైనా వేలాది మంది విద్యార్థులు ఉండే ఈ అడ్డాలో పెను విషాదం చోటుచేసుకునేదని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**నిబంధనలు పాటించాల్సిందే: కమిషనర్**

ప్రమాద స్థలాన్ని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హైడ్రా సిబ్బంది సకాలంలో స్పందించడం వల్లే పెను ప్రమాదం తప్పిందన్నారు. "వరుసగా జరుగుతున్న అగ్నిప్రమాదాలు అందరికీ కనువిప్పు కావాలి. ఇప్పటికే ఫైర్ సేఫ్టీ లేని పలు వ్యాపార సంస్థలకు నోటీసులు ఇచ్చాం, గడువు ముగియగానే కఠిన తనిఖీలు చేపడతాం. అవసరమైతే ఫైర్ చట్టాల్లో మార్పుల కోసం ప్రభుత్వానికి నివేదిస్తాం" అని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు, భవన యజమానులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని, అత్యవసర ద్వారాల వద్ద ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, ఏడీఎఫ్‌వో మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# హైడ్రా డీఆర్‌ఎఫ్ సిబ్బందికి సన్మానం

**3 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి.. మంటలార్పి ప్రాణాలు కాపాడిన వైనం**

**15 మంది సిబ్బందికి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు**



**ప్రజానావ, ఖైరతాబాద్:** హైదరాబాద్‌లో అగ్ని ప్రమాద సమాచారం అందగానే కేవలం మూడు నిమిషాల్లో ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చిన హైడ్రా విపత్తు స్పందన దళం సిబ్బందిని కమిషనర్ ఏవీ రంగనాథ్ సన్మానించారు. అమీర్‌పేటలోని ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం సంభవించగా, సమీపంలో ఉన్న దళం 17 బృందం వెంటనే చేరుకుని మంటలను నియంత్రించింది. అనంతరం దళం 19, 40 బృందాలు నాలుగు నుంచి ఐదు నిమిషాల్లో అక్కడికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులతో కలిసి భవనంపై చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా హైడ్రా విపత్తు స్పందన దళం 17, 19, 40లలోని మొత్తం 15 మంది సభ్యులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఘటన వివరాలు, సమాచారం అందిన వెంటనే ఎవరు ఎలా స్పందించారన్న అంశాలను సిబ్బంది వివరించారు. ఏడీఎఫ్‌వో మోహనరావు, మార్షల్ దుర్గాప్రసాద్, రామకృష్ణ, హతిరామ్, ఉమేష్, యాకూబ్, గోపి, గోపాల్, సాయికుమార్, నాగరాజు, రామిరెడ్డి, రాజు, విజయ్, ఈశ్వర్, సంజు, రజాక్ తదితరులు ఈ చర్యల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు సంచాలకుడు వర్ల పాపయ్య, ఆర్ఎఫ్‌వో జయప్రకాశ్, డీఎఫ్‌వోలు యజ్ఞనారాయణ, గౌతమ్ పాల్గొన్నారు. కమిషనర్ సిబ్బంది ధైర్యసాహసాలను అభినందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో ఇలాగే అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.

# బంజారాహిల్స్‌లో ఆక్రమణల తొలగింపు

- ఎన్‌బీటీనగర్‌లో 300 గజాలు ప్రభుత్వ భూమిగా గుర్తింపు








**ఖైరతాబాద్:** బంజారాహిల్స్ రోడ్ నెం.12 పరిధి ఎన్ బీటీనగర్‌లో ప్రభుత్వ భూములపై ఆక్రమణలున్నాయ న్న వార్తల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టింది. పత్రికలో వచ్చిన కథనంపై స్పందించిన అధికారులు సంయుక్తంగా స్థలాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితిని వెల్లడించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సికింద్రాబాద్ రెవెన్యూ విభాగాధికారి, షేక్‌పేట్ తహసీల్దార్, మండల సర్వేయర్ తదితర సిబ్బంది స్థలాన్ని తనిఖీ చేశారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూమి ఒక భాగం టీఎస్. నెం.7/3 (భాగం), బ్లాక్-కే, వార్డు-12, పాత సర్వే నెం.403/ భాగంగా నమోదై ప్రభుత్వ భూమిగా ఉంది. మిగతా భాగం టీఎస్ నెం.22 (భాగం), పాత సర్వే నెం.129/30గా నమోదై పట్టా భూమిగా గుర్తించారు. స్థల పరిశీలనలో డీ కాంతారెడ్డి అనే వ్యక్తి సుమారు 1100 చదరపు గజాలు పట్టా భూమిగా చూపుతూ పత్రాలు సమర్పించినట్లు తెలిసింది. అయితే అధికారుల సర్వేలో దాదాపు 300 చదరపు గజాలు ప్రభుత్వ భూమిలోకి వస్తున్నట్లు స్పష్టమైంది. దీనితో ఆ ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన నీలి తాత్కాలిక నిర్మాణాలను వెంటనే తొలగించారు. భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని మళ్లీ ఆక్రమణలు జరగకుండా హెచ్చరిక ఫలకం ఏర్పాటు చేశారు. తెలంగాణ హైకోర్టు, భారత సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ప్రభుత్వ భూమిగా నిర్ధారితమైన స్థలాలు ప్రభుత్వానికే చెందుతాయని అధికారులు తెలిపారు. అలాంటి భూముల్లో జోక్యం చేసుకునే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, పట్టా భూములను స్పష్టంగా గుర్తించేందుకు ప్రస్తుతం వివరణాత్మక సర్వే కొనసాగుతోందని, మరింత ఆక్రమణలు గుర్తిస్తే తెలంగాణ భూ ఆక్రమణ నిరోధక చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జిల్లా పరిపాలన ప్రభుత్వ భూముల రక్షణకు కట్టుబడి ఉందని, చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు వాస్తవం కాదని అధికారులు స్పష్టం చేశారు.



## విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన

**సికింద్రాబాద్ :** సీతాఫలమండీ కూడలిలో తన స్వంత ఖర్చుతో ఏర్పాటుచేయనున్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, బాబు జగ్ జీవన్ రామ్ విగ్రహాల ఏర్పాటు పనులను సికింద్రాబాద్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో నిరంతరం స్ఫూర్తిని రేకెత్తించేలా విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నామని, వారి అదర్శాలను పాటించేలా తన వంతు కృషి చేస్తున్నానని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సీతాఫలమండీ ఎస్సీ, ఎస్టీ సంఘాల నేత జీ. చంద్రశేఖర్, బీఆర్ఎస్ సమన్వయకర్త రాజా సుందర్, నాయకులు పాల్గొన్నారు.



పద్నాలుగు వందల ఏళ్ళ కిందట... భయంకర రుగ్మతలతో జనం విలవిలాడారు. ముదిరిన రోగాలకు తోడు హింస దౌర్జన్యం అన్యాయం ఆక్రమాలు, మత్తుపానీయాలు అశ్లీలం అసభ్యత పెచ్చరిల్లాయి. అలాంటి పరిస్థితుల్లో రంజాన్ మాసంలోని ఓ శుభరాత్రి వేళ ఆకస్మాత్తుగా ఆశాకిరణం మెరిసింది. పాపాంధకారాన్ని పారదోలే పవిత్ర ఖురాన్ భూజనులకు అందింది. మానవాళి జీవితాన్ని సంస్కరించి మానవత్వాన్ని పరమళింపచేసింది. అధ్యాత్మిక నైతిక ఆర్థిక. సామాజిక రుగ్మతల్ని నిర్మూలించి .. నీతి న్యాయస్థాపనకు, సమత, సౌభ్రాత్రంతో సమసమాజ స్థాపనకు ఖురాన్ తోడ్పడిందని ముస్లీం మత పెద్దలు చెప్పారు. ఇస్లాం ధర్మంలో ఈమాన్ (విశ్వాసం) నమాజ్,రోజా, జకాత్, హజ్ యాత్ర ముఖ్యమైనవి. వీటిపై శిక్షణ ఇవ్వడానికి రంజాన్ మాసం సరైన సమయం. ఓ విధంగా చెప్పాలంటే ఈనెలంతా ముస్లీంలకు శిక్షణ కాలం వంటిది. ఖురాన్ గ్రంథం ప్రభోదించే సమానత్వం, సౌభ్రాత్రాలను ముస్లీంలు పాటిస్తారు. నమాజ్ లో పఠించే ఖరాన్ సూక్తులు దైవ అదేశాలకు అనుగుణమైన జీవితం గడిపేందుకు ఏలగైతే ఉపకరిస్తాయెా రంజాన్ ఉపవాసాలు సైతం మనిషిలో మనోనిగ్రహం. సహనం, స్థైర్యం, దైవబితి, దాతృత్వం పెంపొందిస్తాయి. అందుకే నెలంతా ఉపవాసాలు పాటించాలని విస్తృతంగా దాన ధర్మాలు చేయాలని, తరావి నమాజ్ పాటించాలని సృష్టికర్త ముస్లీంలను అదేశించినట్లు పవిత్ర గ్రంథం ఖురాన్ పేర్కొంది.

# పవిత్ర జీవన దీప్తి.. రంజాన్ స్ఫూర్తి

## ప్రారంభమైన పవిత్ర రంజాన్ మాసం ఉపవాస దీక్షలు



### ఉపవాసం (రోజా):

ఉపవాసంమంటే సంయవనం దురుఉద్దేశాల నుంచి దుష్టవాంఛల నుంచి కాపాడుతుంది. మహ్మద్ ప్రవక్త నిర్దేశానుసారం ముస్లీంలు రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష పాటిస్తారు. ఉత్తమ మానవత్వాన్ని పెంచే ఈ ఉపవాసం ప్రేమ దయారుపాల్లో బహిర్గతమవుతుంది. సాటి మనిషి వృధా భరిత జీవితాన్ని ఎలా అర్థం చేసుకోవాలో భోదిస్తుంది. మానవున్ని పరిణిత కలిగిన వ్యక్తిగా మారుస్తుంది. పరుల సుఖశాంతుల కోసం జీవించేలా చేస్తుంది. ఉపవాసం అధ్యాత్మికమైన ప్రాణవాయువు రంజాన్ మాసంలో అన్ని రోజులు నిరహార దీక్షలో ఉండి తమ ధోరణి వల్ల ఏర్పడిన సమస్యల్ని జరిగిన పాపకృత్యాల్ని తలచుకొని పశ్చాత్తాపంతో మన్నించుమని అల్లాహ్ ని ఎవరు వేడుకొంటారో వారి లక్ష్యం నేరవేరినట్లేనని ఇస్లామ్ ప్రకటిస్తుంది. ఈ ఉపవాసాన్ని అరబిక్ భాషలో "సౌమ్" అంటారు. సౌమ్ అంటే ఏదైనా ఒక వస్తువుకు దూరంగా ఉండటమని అర్థం. ఉషోదయం నుంచి సూర్యస్తమయం దాక తినడం త్రాగడం వంటి వాటికే కాక మనోవాంఛలకు దురుఅలవాట్లకు దూరంగా ఉంటారు.

కనుక సౌమ్ (పవిత్ర మాసం) స్థారకమై వెలిసింది. రోజా ఉండే వారు ఉష:కాలనికి ముందే మేల్కోవాల్సి ఉంటుంది. తెల్లవారు జూమునా నాలుగైదు గంటల మద్య అన్నపానీయాలు సేవనం పూర్తి చేస్తారు. దీన్ని "సహేరి" అంటారు. ఇక సూర్యాస్తమయం కాగానే ఉపవాస దీక్ష విరమణ చేస్తారు. దీన్ని "ఇఫ్తార్" అంటారు. ఉపవాస వ్రతం పాటించే వారు ఈ మాసమంతా రోజు అయిదు వేళల నమాజ్ కాక రాత్రి అదనంగా తరావి నమాజ్ ఉంటుంది. మసీదుల్లో ముస్లీంలు తన్మయులవుతారు. ప్రతి ఇల్లు సహేరి–ఇఫ్తార్ తో కొత్త శోభతో అలరారుతుంది. అందరిలోను సేవా దృక్పథం అత్మీయతా భావాలు వెలవడుతాయి. తనలోని కారుణ్య గుణం తన దాసులైన మానవుల్లోను ఉండటాన్ని చూసి అల్లాహ్ ఇష్టపడుతాడు. కరుణించేవాడైనా అల్లాహ్ పేరిట ప్రతి మంచి పని ప్రారభించాలంటుంది. ఇస్లామ్ శాంతి సహనం సామరస్యం త్యాగం ఆధ్యాత్మక ప్రధాన లక్ష్యంగా రూపుదిద్దుకుంటుంది. రంజాన్ మాసం స్వార్థానికి పరమ విరోధిగా ఉండమని బోధిస్తుంది. మహ్మద్ ప్రవక్త ఒక సారి ఇలా చెప్పారు.ఉపవాసంలో ఉండి అసత్యం పలికితే ఆ వ్యక్తి కేవలం ఆకలి దప్పులతో ఉన్నట్లు లెక్కఅల్లాహ్ దృష్టిలో అతని ఉపవాసానికి ఎలాంటి విలువ ఉండదు. ఉపవాస లక్ష్యం మనిషి ఆకలి దప్పులతో ఉంచటం కోసం కాదు అసమయంలో అల్లాహ్ పై విధేయత కనబరిచి తన పరిధిలో మరింత పవిత్రంగా ఉండటం అలవరుచుకోవడానికి ప్రభువు నిషేదించిన చెడులకు దూరంగా ఉంచటానికి రంజాన్ మాసం తరువాత కూడ అదే స్ఫూర్తిని కొనసాగించాలి. ఇది ఇస్లాం జీవన విధానంకావాలని నెల రోజుల పాటు చిత్త శుద్ధితో పాటు పరలోక ప్రతిఫల ఆపేక్షతో పచ్చినీరు కూడ తీసుకొకుండా మనోవాంఛలకు దూరంగా కఠిన ఉపవాస దీక్ష నిర్వహించిన తర్వాత వ్యక్తి మనసు శరీరం పూర్తిగా పరిశుద్ధమవుతాడు. రంజాన్ తర్వాత ఆ స్ఫూర్తిని కొనసాగిస్తే ప్రాపంచిక మాయలో పడిపోయెా ప్రమాదం ఉండదు. తన పక్క వ్యక్తి ఆకలితో అలమటిస్తుండగా తాను మాత్రం సుఖసంతోషాలతో గడపడం సరికాదని మహ్మద్ ప్రవక్త భోదించారు.



### ఫిత్రా

రంజాన్ నెలలో రెండు విధాలుగా దానం చేస్తారు. మొదటిది ఫిత్రా దీన్ని రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరు నిరుపేదలకు చెల్లిస్తారు. ఈ దానం వల్ల పేదల పండుగ అవసరాలు తీరుతాయి. అందువల్ల వాన ఫిత్రాను పండుగ కన్నా వారం రోజుల ముందే ఇవ్వాలి. ఆపైకంతో పేదలు నూతన వస్త్రాలు కొంటారు. ఫిత్ర దానం చెల్లించినంతవరకు రంజాన్ ఉపవాసాలు ఫలప్రదం కాదని ఇస్లామ్ చెప్తుంది. ఫీత్రాకు ముస్లీయేతరులు అర్హులే. కులమతాల విచక్షణ చూపడం ధర్మం కాదంటోంది ఇస్లామ్. జకాత్ పేదలకు ఆర్థిక హక్కు. రెండవ దానం జకాత్. జకాత్ అంటే అరబిక్ భాషలో పరిశుద్ధ పరచడం అభివృద్ధి పరచడం అని అర్థాలు. సంపన్నుల వద్ద నిలువ ఉన్న ధనంతో రెండున్నర శాతం ప్రతి సంవత్సరం అల్లాహ్ కానుకగా నిరుపేదలకు అందజేయాలి. సత్మార్యలకు వినియోగించాలి. ముస్లీంలు జకాత్ చెల్లింపులకు రంజాన్ ను ఎంచుకుంటారు. ఇస్లాం ధర్మశాస్త్రానుసారంగా నమాజులు,ఉపవాసం చేసినట్లే జకాత్ సైతం తప్పనిసరిగా పాటించాల్సిన విధి. ఉపవాసం శారీరక పరమైన ఆరాధన అయితే జకాత్ ఆర్థికపరమైన ఆరాధన. దానం వల్ల మానవుల్లో త్యాగం సానుభూతి సహనం పెంపొందుతాయి. ఆత్మ పరిశుద్ధమవుతుంది.

### ఎత్తెకాఫ్:

ముస్లీం యువకులు రంజాన్ నెలలో పూర్తిగా దైవ ప్రార్థనలో తలమునకలై మసీదుల్లోనే ఉంటారు. అన్నం నీరు అంతా అక్కడే దీనినే ఎత్తెకాఫ్ అంటారు. ఈ మాసం చివరి 10రోజుల్లో ప్రాపంచిక వ్యవహారాలతో సంబంధం లేకుండా కేవలం దైవారాధన దైవనామస్మరణాలతో మసీదుల్లో అయిన ఎత్తెకాఫ్ వేళ మసీదు నుంచి బయటికి రారు. అసలు ఇంటి విషయాలను పూర్తిగా పట్టించుకోరు. మచ్చుకు 10 రోజుల పాటు మసీదులో ఎత్తెకాఫ్ నిర్వహించాలి. దీనితో చేడును దరికి రానీయక పోవడం అత్మనిగ్రహం భక్తి వంటి మానసీయ గుణాలు అలవడుతాయి.

### ఫర్జ్:

ముస్లీంలు తప్పకుండా పాటించాల్సిన నిబంధనలే ఫర్జ్ ఇవీ చట్టంలోని రూల్స్ వంటివన్నమాట. వీటిని ఎట్టి పరిస్థితుల్లోను ఉల్లంఘించకూడదు. నమాజ్ చేయడం రోజా జకాత్ పాటించడం హజ్ యాత్ర వారి తల్లిదండ్రుల్ని భార్య పిల్లలను పోషించడం రోజుకు 5 వేళల నమాజ్ చేయడం వంటివి ఫర్జ్ వీటిని ఉల్లఘించే విల్లేదు.

### సున్నత్:

మహ్మద్ ప్రవక్త పాటించిన సంప్రదాయాన్ని నియమాలను సున్నత్ అంటారు. ఆయన పాటించిన అన్ని విషయాల్ని ఆచరించాలి. నమాజ్ కు ముందు వజు చేయడం నియమం.

### హదీస్:

మహమ్మద్ ప్రవక్త ఉపన్యాసాల సముహరమే హదిస్. ఇస్లాం ప్రకారం జీవితంలో ఏలా నడుచుకోవాలో పలుసందర్భాల్లో ఆయన తన శిష్యులకు సూచించారు వీటినే హదీస్ అంటారు.

### లైలతుల్ ఖద్ర్ (షబ్ ఎ ఖద్ర్)

రంజాన్ నెల చివరి 10 రోజుల్లో అత్యంత శుభ్రప్రదమైన రాత్రి ఒకటుంటుంది. అది 1000 మాసాల కన్న శ్రేష్టతరమైందని ఖురాన్ వివరిస్తుంది. ఈ రేయిని లైలతుల్ ఖద్ర్ అంటే మహత్వపూర్ణమైన రాత్రి అని అర్థం. ఈ రాత్రే దివ్యఖురాన్ అవతరించిందని విశ్వాసం. 1000మాసాలంటే ఒక జీవితం కాలమని భావించి 83 సంవత్సరాలు క్రమం తప్పకుండా చేసే ఆరాధన కన్నా ఈ రాత్రి చేసే ఆరాదన మహత్తరమైంది. ఈ రాత్రంతా మేలుకొని ప్రార్థనల్లోను ధ్యానంలోను గడిపితే హృదయాల్ని అవరించిన అజ్ఞానపు అంధకారం తొలిగిపొయి అధ్యాత్మిక తేజం మనశ్శాంతి " లభిస్తాయని పుణ్యప్రాప్తి జరుగుతుందని విశ్వసిస్తారు. ఇందుకు సంబందించిన అనేక ఉపదేశాలు ఈరాత్రి వింటారు. హృదయం ప్రశాంతమవుతుంది. నిర్మలమై పరోపకార సౌరభాన్ని వెదజల్లుగలుగుతుంది.



**రోజా విదులు.. సాధరణంగా ప్రతి విశ్వాసి రంజాన్ నెలలో రోజాతో పాటు అవయావాల రోజా పాటించాలి. దీనికి ఆరు విధాలైన విధుల్ని దృష్టిలో పెట్టుకోవాలి.**

**1) చూపుకు సంబంధించిన రోజా:** చూపులు కిందికి వాల్చుకొవడం,మర్యాద కళ్ళతో మసీద్ను చూడండి. పవిత్ర ఖురాన్ చూడండి. వీలైతే కాబా గృహ కాంతుల్ని చూడండి. సువాసన భరితమైన మక్కా నగర వీధులను దర్శించండి. అంతేకాని అల్లాహ్ నిషేదించిన వస్తువులను చూడకండి. స్త్రీలను చూడకండి. దైవభక్తిని దూరం చేసే ఏ చూపును చూడకండి.

**2) నాలుక రోజా:** అసభ్యకరమైన మాట నోటితో రాకూడదు. మాట్లాడేటప్పుడు సభ్యత గల మాటలే మాట్లాడాలి. ఖురాన్ పఠణం చేయండి. ఖురాన్ ను దర్శించండి. దైవనామస్మరణ చేయండి. దేవుని గొప్పతనాన్ని ప్రశంసించండి. అనవసర విషయాలు మాట్లాడకండి. తీట్లు పరోక్ష నింద చాడీలు మొదలైన వాటి జోలికి పోకండి. శరీరానికి ఏదైనా మురికి అంటితే దాన్ని కడిగేస్తే పోతుంది కాని నోటిని సప్త సముద్రాలతో కడిగినా అమురికి పోదు.

**3)చేతి రోజా:** చేతిని పుణ్యాకార్యం కోసం మాత్రమే ఉపయోగించాలి. మూత్ర శుద్ధి లేకుండా దివ్యఖురాన్ ను తాకరాదు. పుణ్యపురుషులతో చేతిని కలుపాలి. చేతులెత్తి దరుదే షరీఫ్ అర్పించండి.

**4)కాళ్ళ రోజా:**: నడిస్తే పుణ్యకార్యలు చేసేందుకు నడవాలి. మసీద్ వైపు నడవాలి. పుణ్యాకార్యాలను ప్రోత్సాహించాలి. సహాయం చేసేందుకు నడవాలి.

**5)హలాల్ సంపాదన:** దీనినే దర్మ సమ్మతమైన సంపాదన అంటారు. ఇఫ్తార్ చేసే సమయంలో తీసుకోవాలి. ఎందుకంటే గొంతు వరకు నిండినా కడుపు కంటే అయిష్టమయినది అల్లాహ్ వద్ద మరేది లేదు.

**6)భయం అశ:** రోజా విరమించిన తర్వాత భయం అశ వంటి భావం ఏర్పాడాలి. అల్లాహ్ తమ వ్రతాన్ని అంగీకరించి తన్ను తన ప్రియదాసుల్లో చేర్చుకుంటాడన్న ఆశతో ఉండాలి. జీవితాన్ని సద్భావనలతో సహకారం సహజీవనం వంటి ఉన్నత గుణాలతో సలీకృతం చేసుకున్నప్పుడే ఇహపర సుఖాలు ప్రాప్తిస్తాయన్నది రంజాన్ సందేశం.

టీ వేణు గోపాల్ రెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

